ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
శుక్రవారం 4, సెప్టెంబరు 2024

● ఒంగోలులో సినీ హీరోయిన్ కీర్తి సురేష్ హంగామా

'మహానటి' సందడి



సినీనటి కీర్తి సురేష్ గురువారం ఒంగోలులో సందడి చేశారు. ఆమెను చూసేందుకు భారీగా వచ్చిన అభిమానులతో రహదారి కిక్కిరిసింది. ఆమె చీరకట్టుతో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సెల్ఫీ కోసం యువకులు పోటీపడ్డారు. చెన్నై షాపింగ్ మాల్ 20వ షోరూంను నగరంలోని గుంటూరురోడ్డులో కీర్తి సురేష్ ప్రారంభించారు. ఒంగోలు రావటం మొదటిసారని, అభిమానుల ఉత్సాహం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆమె చెప్పారు. **- ఒంగోలు కల్చరల్**

మెప్మాలో మళ్లీ రుణ గోల్‌మాల్.!

మెప్మాలో మళ్లీ రుణగోల్‌మాల్ చోటుచేసుకుంది. గతంలో రుణాల పేరుతో కోట్లు దోచుకున్న మాదిరిగానే ఇప్పుడు బోగస్ గ్రూపులు పెట్టి కోట్లు కొల్లగొట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కనీస చర్యలు లేకపోవడం, పైగా ఆ సిబ్బందినే ప్రస్తుతం కూడా విధుల్లో కొనసాగిస్తుండటం గమనార్హం. ఇదే అవకాశంగా తాజాగా మరి కొంతమంది నకిలీ గ్రూపులను సృష్టించారు. చిరువ్యాపారం పేరుతో బ్యాంకులకు టోకరా వేసి రూ.2కోట్ల మేర దోచుకున్నట్లు సమాచారం. కొందరు ఉద్యోగులు వారికి అండగా నిలుస్తూ అవసరమైన సహకారం అందించినట్లు తెలుస్తోంది. గత రుణ స్కాంతోపాటు, తాజాగా వెలుగులోకి వచ్చిన నకిలీ రుణాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గతంలో రూ.40 కోట్లు మాయం
ఆ కుంభకోణంపై
విచారణ, చర్యలు నామమాత్రం
తాజాగా రూ.2కోట్ల రుణదోపిడీ
బోగస్ గ్రూపుల ఏర్పాటు
నాడు అవినీతిపై గోల చేసిన
వారే నేడు వత్తాసు
పూర్తి సహకారం అందిస్తున్న సిబ్బంది

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 3 : పేదల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అవినీతికి నిలయంగా మారింది. అర్హులైన వారికి రుణాలు ఇవ్వడంలో మొండిచేయి చూపుతున్న యంత్రాంగం, బోగస్ గ్రూపులకు భరోసా కల్పిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ పొదుపు గ్రూపులతో సుమారు రూ.40కోట్లు వరకు రుణాలు తీసుకుని బ్యాంకులను బురిడీ కొట్టించిన విషయం తెలిసిందే. ఈ స్కాంలో ఉన్న ఆర్పీలు, మెప్మా సిబ్బందిపై ఫిబ్రవరి 4వ తేదీ నుంచి ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. ఒక్కసారిగా ఉలిక్కిపడిన ఆ శాఖ అధికారులు తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు భారీగానే చేశారు. అయితే అప్పట్లో మేయర్ గంగాడ సుజాత అంత పెద్దమొత్తంలో అవినీతి జరగలేదని, రూ.12కోట్లు మాత్రమే స్కాం జరిగిందంటూ మీడియా సమక్షంలో వెల్లడించారు. ఇదిలాఉంచితే కథనాలపై స్పందించిన అప్పటి కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ ముగ్గురు అధికారులతో విచారణకు ఆదేశించారు. విచారణలో తేలిన వాస్తవాలు ఏమిటో, ఎంతమేర గోల్‌మాల్ జరిగింది, ఎవరు బాధ్యులో ఇంతవరకు తేల్చకపోవడంతో మెప్మాలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం మరుగునపడిపోయింది.

పేర్లు మార్చి నకిలీ గ్రూపులు

కొన్ని నకిలీ గ్రూపులను చూపి ఒంగోలు నగరంలో ఓ గుర్తింపు కలిగిన బ్యాంకులో రుణాలు పొందినట్లు సమాచారం. పేర్లు మార్చి నకిలీ గ్రూపులను ఆర్పీలే తయారుచేస్తున్న తీరును అందరూ ఆశ్చర్యపోతున్నారు. వాస్తవానికి ఒక గ్రూపులో పదిమంది సభ్యులు ఉంటారు. అదే విధంగా ఒక్కో ఆర్పీ కింద కొన్ని గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూపు నుంచి ఇద్దరు మహిళా సభ్యుల పేర్లు తీసి, వారి ఆధార్ కార్డులు మార్చేసి, గ్రూపు పేరును కూడా పూర్తిగా మార్చకుండా ముందు ఏదో ఒక పదాన్ని చేర్చి మరో కొత్త గ్రూపును తయారుచేస్తారు. అయితే ఎప్పటి నుంచో బ్యాంకర్లతో రుణాలకు సంబంధించి పరిచయాలు కలిగిన ఆర్పీలు కొత్త గ్రూపులుగా వారికి చూపుతారు. ఆ వెంటనే వారికి లక్షల్లో రుణాలు మంజూరుచేయిస్తారు. అయితే ఇదంతా గ్రూపు సభ్యులకు తెలియదు. ఇలా వందల సంఖ్యలో గ్రూపులను తయారు చేసి ఒంగోలు నగరంలోనే రూ.2కోట్ల మేర స్వాహా చేసినట్లు సమాచారం.

నాడు ఆరోపించారు.. నేడు మౌనం దాల్చారు

మెప్మాలో అవినీతి నిగ్గుతేల్చాలి? కోట్ల రూపాయలు దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు తర్వాత కిమ్మనకుండా మౌనంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాడు దొంగ దొంగ అన్నవారే నేడు వారితో చేతులు కలిపి, విచారణ అంశాలపై నోరు మెదపకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు మరో రుణమాయకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మరో పది బోగస్ గ్రూపులు ఏర్పాటు కావడం, అందుకు మెప్మా కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు సహకారం అందించడం విశేషం. వారికి తోడుగా మేమున్నామంటూ టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



* వాస్తవాలు వెలికితీస్తే మరిన్ని బోగస్ రుణాలు

మెప్మాలోని కొందరు ఆర్పీలు ఈ రుణ మోసంలో సూత్రధారులుగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ వ్యవహారం అమాయక పొదుపు మహిళలు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అయితే పొదుపు మహిళల పేరుతో నకిలీ గ్రూపులు సృష్టించి కోట్ల రూపాయల నిధులు కాజేసిన వైనంపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేకపోలేదు. అంతే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి బోగస్ రుణాలకు కళ్లెం వేసినట్లు అవుతుందని, అలాగే వారిపై చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని పలువురు పొదుపు మహిళలు కోరుతున్నారు.

బోగస్ గ్రూపులపై విచారించి చర్యలు తీసుకుంటాం

- టి.రవికుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్



బోగస్ గ్రూపులు సృష్టించి, రుణాలు పొందడంపై విచారణ చేస్తాం. అందుకు బాధ్యులైన వారిని గుర్తించి తగుచర్యలు తీసుకుంటాం. అయితే క్షేత్రస్థాయిలో పొదుపు గ్రూపులు నేరుగా బ్యాంకుల ద్వారానే రుణాలు పొందుతాయి. దీంతో ఈ విషయం మెప్మా అధికారులకు తెలిసే అవకాశం ఉండదు. ఈ అంశాన్ని బ్యాంకు అధికారులతో జరిగే సమావేశాల్లో పలుమార్లు హెచ్చరించాం. బ్యాంకులు మంజూరు చేసే రుణాలు నేరుగా గ్రూప్ సభ్యుల వ్యక్తిగత ఖాతాలోకి జమ అవుతాయి. ఇవి మెప్మా నిధులు కాదు. గతంలో బోగస్ గ్రూపులను ప్రోత్సహించిన ఇద్దరు సీఎల్‌ఆర్పీలు, ఐదుగురు ఆర్పీలను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాం. ఇలాంటి వ్యవహారాలను అరికట్టేందుకు మెప్మా ఎండీ ఎస్‌హెచ్‌జీల డేటా ప్యూరిఫికేషన్‌కు ప్రత్యేక యాప్ త్వరలో ప్రారంభిస్తున్నారు. ఈ యాప్ ద్వారా ఒక సభ్యురాలు ఒక గ్రూపులోనే నమోదవుతుంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గ్రానైట్ అక్రమ రవాణాను నియంత్రించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3 : జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం జిల్లా గ్రానైట్ స్లాబ్‌ల అక్రమరవాణాపై జరిగిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అనధికార రవాణాను నియంత్రించేందుకు రెవెన్యూ, పోలీస్, కమర్షియల్ ట్యాక్స్, మైన్స్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమైన మేరకు మొబైల్ టీంల ఏర్పాటు చేయాలని చెప్పారు. కమిటీలో చర్చించిన విధంగా రెండు చెక్‌పోస్టులతో పాటు సీసీ టీవీలు ఏర్పాటుచేయాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై ఇటీవల తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అడ్డుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ మాట్లాడుతూ చీమకుర్తి మండలంలోని చీమకుర్తి, బూదవాడ, ఆర్‌ఎల్‌పురంలలో 85 బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలు పనిచేస్తున్నాయని, సగటున జిల్లాకు రూ.250 కోట్ల రెవెన్యూ వస్తోందని చెప్పారు. ఉత్పత్తి చేసే గ్రానైట్ మెటీరియల్‌లో 80శాతం చైనా, తైవాన్, యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతోందని, మిగిలిన 20శాతం స్థానిక గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలలో ప్రాసెస్ చేస్తారని తెలిపారు. గత ఐదేళ్లలో జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై 1,225 కేసులు నమోదు చేసి రూ.206.31 కోట్లు పెనాల్టీ విధించినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల పాల్గొన్నారు.

సజావుగా టెట్



ఒంగోలులో హాల్ టికెట్ నంబర్‌ను చూసుకుంటున్న అభ్యర్థులు

ఒంగోలు(విద్య), అక్టోబరు 3 : జిల్లాలో గురువారం ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష మొదటిరోజు సజావుగా జరిగింది. నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం సెషన్‌కు ఉదయం 8 నుంచి, మధ్యాహ్నం సెషన్ ఒంటిగంట నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష ప్రారంభ సమయానికి ఉదయం 9.30లోపు, మధ్యాహ్నం 2.30లోపు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలుచేయడంతోపాటు ఆ కేంద్రాల పరిధిలో జెరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూయించారు. ప్రతి పరీక్షాకేంద్రంలో ఎంఈవో డిపార్ట్‌మెంట్ అధికారిగా వ్యవహరించగా టీసీఎస్ నుంచి ఒక ఇన్‌చార్జి, అభ్యర్థుల సంఖ్యను బట్టి అసిస్టెంట్లను నియమించారు.

* 117 మంది గైర్హాజరు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష మొదటిరోజు రెండు సెషన్లలో 117 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 525 మందికి 461 మంది పరీక్షకు హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 386 మందికి 333 మంది హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరిగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సామా సుబ్బారావు, ఒంగోలులోని పరీక్షా కేంద్రాలను, కే.శివకుమార్ మార్కాపురంలోని కేంద్రాలను తనిఖీ చేశారు. డీఈవో డి.సుభద్ర ఒంగోలులోని కేంద్రాలను సందర్శించారు.



దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఒంగోలు నగరంలో పలు దేవాలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ఉత్సవాల్లో తొలిరోజైన గురువారం బాలాజీరావుపేటలోని పోలేరమ్మగుడిలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

విజన్-47 లక్ష్యంగా ముందుకు..

క్యూఆర్ కోడ్‌తో అభిప్రాయ సేకరణ
11 అంశాలపై సర్వే ముమ్మరం
సాంకేతిక పరిజ్ఞానంతో
కొనసాగుతున్న ప్రక్రియ

ఒంగోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర 2047 పేరుతో ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. మొబైల్ ఫోన్‌లో క్యూఆర్ కోడ్ ఆధారంగా 11 అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో స్మార్ట్ ఫోన్ ఉన్న వారి నుంచి అభిప్రాయాలను తీసుకుంటున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తవుతుండగా అప్పటికి ప్రపంచంలో మూడో అగ్రగామి శక్తిగా భారత్ నిలవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ 2047 పేరుతో సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే సమయంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణ లక్ష్యంతో పనిచేస్తున్న రాష్ట్రప్రభుత్వం కూడా 2047 నాటికి దేశంలో ఏపీ ఒక పెద్ద వృద్ధి చెందిన రాష్ట్రంగా తయారవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.



అభిప్రాయాలు సేకరిస్తున్న సిబ్బంది

* సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఆర్థిక, సామాజిక, వాతావరణ సుస్థిరతలపై దృష్టి సారించి స్వర్ణాంధ్ర 2047 పేరుతో దార్శనిక పత్రం(విజన్) రూపొందిస్తున్నారు. వచ్చే నవంబరు 1న దానిని ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈలోపు ప్రభుత్వం రూపొందించే ప్రణాళికలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న ఆలోచనకు వచ్చిన ప్రభుత్వం అందుకు చర్యలు చేపట్టింది. అందుకోసం క్యూఆర్ కోడ్‌ను రూపొందించి దాని ద్వారా సేకరిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ప్రశ్నల రూపంలో 18 అంశాలు వరుసగా వస్తాయి.ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యాటక, వాతావరణ సమతుల్యత, పునరుత్పాదక ఇంధనం తదితర అంశాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది ద్వారా అభిప్రాయాల సేకరణ చేస్తున్నారు.

* ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక

ఐదు రోజుల్లో ఇప్పటివరకు 70వేల మంది అభిప్రాయాలు తెలియజేసినట్లు సమాచారం. మరో 30వేల మందిని 5వతేదీలోగా సర్వే చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలాఉండగా 2047 అనేది సుదీర్ఘ సమయం కావడంతో జిల్లా, మండలస్థాయిలో ప్రగతి కోసం 2024-29 మధ్య ఐదేళ్ల కార్యచరణ ప్రణాళిక రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా సహజ వనరులు, వాటి సద్వినియోగం, విద్య, ఉపాధి అవకాశాలు పెంపు, అందుకు వ్యవసాయ. పారిశ్రామిక, సేవారంగాలలో తీసుకోవాల్సిన చర్యలను ఈ ప్రణాళికల్లో పొందుపరుస్తున్నారు.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ భేటీలో డిమాండ్ ● ఎడ్జ్ కటింగ్ మిషన్ వారికి మెటీరియల్ ఇవ్వకూడదని నిర్ణయం

ఆదివారం ఉత్పత్తి ప్రక్రియకు బ్రేక్ ● సబ్సిడీలు చెల్లించాలని ప్రభుత్వానికి వినతి

చీమకుర్తి, అక్టోబరు 3: గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య కోరారు. అసోసియేషన్ నాయకులు తమ సమస్యలపై చర్చించటానికి గురువారం రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో భేటీ అయ్యారు. చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, మర్రిచెట్లపాలెం, ఏలూరు రోడ్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు ఈ సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఫ్యాక్టరీల్లో ప్రతి ఆదివారం ఉత్పత్తి ప్రక్రియకు బ్రేక్ ఇవ్వాలని, ఎడ్జ్‌కటింగ్ మిషన్ వారికి మెటీరియల్ ఇవ్వకూడదని తీర్మానించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సబ్సిడీలను త్వరగా మంజూరు చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. బిల్లులు లేకుండా గ్రానైట్ శ్లాబులు రవాణా చేయటం వల్ల వస్తున్న నష్టాలపై బీవీఎల్ వెంకట్రావు సమావేశంలో లేవనెత్తారు. ఈ అక్రమ రవాణాను అరికట్టటానికి ఓనర్లు అందరూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే గుండ్లాపల్లి, పొదిలి, టంగుటూరు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, నూకల సురేంద్ర, బొమ్మిశెట్టి మధుసూదనరావు, రావిపాటి రాంబాబు, అమ్జాద్ బాష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య



ఓనర్లతో మాట్లాడుతున్న ఎడ్జ్ కటింగ్ మిషన్ యజమానులు

ఎడ్జ్‌కటింగ్ మిషన్ వారి ఆక్రందన..

గ్రానైట్ ఫ్యాక్టరీలలో ప్రాసెసింగ్ తదుపరి మిగిలిన వేస్ట్ ముక్కలను తీసుకెళ్లి వన్ బై వన్ ముక్కలుగా తయారు చేసుకొంటూ ఇన్నాళ్లు ఎడ్జ్‌కటింగ్ మిషన్ వారు జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా వేస్ట్ మెటీరియల్‌ని ఫ్యాక్టరీ ఓనర్లు వీరికి ఇవ్వటాన్ని బ్యాన్ చేయటంతో వీరి కుటీరపరిశ్రమలు మూతపడ్డాయి. దాదాపు 170వరకూ ఇలాంటివి ఈ ప్రాంతంలో ఉన్నాయి. బజారున పడిన వీరంతా ఫ్యాక్టరీ ఓనర్ల సమావేశం వద్దకు వచ్చి ఆందోళన చేశారు. ఎడ్జ్‌కటింగ్ మిషన్ వారికి వేస్ట్ మెటీరియల్ ఇవ్వకూడదన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని అసోసియేషన్ నాయకుల ఎదుట తమ ఆక్రందనను వెళ్లగక్కారు. కానీ మీకు మెటీరియల్ ఇచ్చినందున తాము నష్టపోతున్నామని, ప్రస్తుత తమ నిర్ణయంలో మార్పులేదని, వచ్చే నెలలో జరిగే సమావేశంలో తగు నిర్ణయం తీసుకుంటామని ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు చెప్పటంతో ఎడ్జ్‌కటింగ్ వారు ఉసూరుమన్నారు. పునరాలోచించాలని వేడుకున్నారు.

జీతాల కోసం ఉద్యోగుల ఎదురుచూపు

● 40శాతంలోపు మందికే అందిన వేతనాలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు జీతాల కోసం రోజులు తరబడి ఎదురు చూసినా పడని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగినసార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు టీడీపీ కూటమికి మద్దతు పలికారు. మొదటి రెండు నెలలు 3వతేదీలోపు జీతాలు పడగా, గత నెలలో ఏడెనిమిది తేదీల్లోపు జీతాలు పడ్డాయి. ఈనెలలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ట్రెజరీ, పోలీస్, న్యాయశాఖ, రెవెన్యూశాఖ,వైద్యశాఖ ఉద్యోగులకు పూర్తిగా వేతనాలుపడగా, మిగిలిన శాఖల ఉద్యోగులకు జీతాలు పడలేదు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగులు సుమారు 45వేల మంది ఉండగా రిటైర్డ్ ఉద్యోగులుమరో 20వేల మందికి పైగా ఉన్నారు. గురువారం సాయంత్రానికి కేవలం 40శాతం మంది ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడ్డాయి. జిల్లాలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారికి కూడా ఇంతవరకు జీతాలు పడని పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

● జిల్లా ఇన్‌చార్జి సత్యేంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యేంద్రబాబు

ఒంగోలు(క్రైం), అక్టోబరు3: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి, పీసీసీ జనరల్ సెక్రటరీ సత్యేంద్రబాబు, డీసీసీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ పూర్తిగా విఫలమైందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అల్టిమేటం మేరకు 24 గంటలలో కాంట్రాక్ ఉద్యోగులను తిరిగి తీసుకున్నారని గుర్తు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ విజయంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసుందుకు అధ్యక్షురాలు షర్మిలారెడ్డి క్షేత్రస్థాయి నుంచి కమిటీలు వేసేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలపర్తి విజేష్‌రాజ్, ఉద్దండి మల్లిఖార్జున్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రిహానాబాను తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

● కలెక్టర్ అన్సారియా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం(ఒంగోలునగరం), అక్టోబరు 3: రైతులు పంటలసాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని బాగా తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. గురువారం కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రసాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంటల దిగుబడులు పెంచే దిశగా రైతుల్లో చైతన్యం కలిగించే లక్ష్యంతో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. వ్యవసాయంలో సుస్థిరాభివృద్ధి సాధించటంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రైతులకు వినూత్న వ్యవసాయ పద్ధతులు తెలియజేసే దిశగా ఈ కార్యక్రమం జరుగుతుందని, సేంద్రియ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తుందని తెలిపారు. సేంద్రియ వ్యవసాయానికి కొత్తపట్నం మండలాన్ని మోడల్‌గా ఎంపిక చేశామన్నారు. రైతులకు అవసరమైన రుణాలను కూడా ప్రభుత్వం సత్వరమే అందిస్తుందని వివరించారు. డీఏవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మత్స్యశాఖశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రమణ, ఎల్‌డీఎం డి.రమేష్, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం సుభాషిణి, ఆర్డీవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శ్రీకృష్ణ పాల్గొన్నారు.

పవన్ బహిరంగసభ వీక్షణకు ఎల్ఈడీ స్క్రీన్‌లు



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: తిరుపతిలో ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభను వీక్షించేందుకు జిల్లా కేంద్రమైన ఒంగోలులో మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో గురువారం రాత్రి ఐదు ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద, కొత్తపట్నం బస్టాండు, కర్నూలు రోడ్డులోని నవభారత్ బిల్డింగ్ వద్ద, లాయర్‌పేట, అద్దంకి బస్టాండులో ప్రజలు వీక్షించేలా ఈ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే పవన్‌కల్యాణ్ ప్రసంగం వినేందుకు జనసేన పార్టీ నాయకుడు, రవిప్రియామాల్ అధినేత కంది రవిశంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఆధ్వర్యంలో నగరంలోని సంతపేట, గంటాపాలెం, రవిప్రియామాల్, లాయర్‌పేటలో ఈ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ఉప్పుగుండూరులో పూజలు చేస్తున్న భక్తులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 3 : దేవి శరన్నవరాత్రి వేడుకలు మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉప్పుగుండూరులోని బ్యాంక్‌బజారులో స్థానికులు తొలిసారి ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దుర్గాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను నిర్వహించారు. ఇక అమ్మనబ్రోలు చెన్నమల్లేశ్వర ఆలయం, చీర్వానుప్పలపాడులోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో దసరా సంబరాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణలో పూజలు చేశారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

● పనితీరుపై కమిషనర్ ఆగ్రహం

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 3: పౌరసేవలను సక్రమంగా నిర్వహించని పలువురు సచివాలయ సెక్రటరీలకు కమిషనర్ వెంకటేశ్వరరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గురువారం నగరంలోని కేశవరాజుపేట, గాంధీనగర్ సచివాలయాలను ఆయన తనఖీ చేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ సెక్రటరీ విధుల్లో లేకుండా, సెలవు పెట్టకుండా ఊరికెళ్లడాన్ని గుర్తించారు. ఈమేరకు అడ్మిన్‌కు ఫోన్ చేయగా ఫీల్డులో ఉన్నానని బదులివ్వడంతో వెంటనే వీడియో కాల్ చేసిన కమిషనర్ విధులకు డుమ్మా కొట్టినట్లు గుర్తించారు. పన్నుల వసూళ్లలో పురోగతి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఫీల్డు వర్క్‌లో ఉన్నపుడు లోకేషన్ షేర్ చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురుకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా గుంటూరురోడ్‌లోని గ్రీన్ బెల్ట్ ఆక్రమించి ఇష్టారాజ్యంగా గుర్తించిన కమిషనర్ ఆదేశాలతో అధికారులు వెంటనే ఆక్రమణలు తొలగించారు.

రెవెన్యూ సిబ్బంది పనితీరు మారాలి: కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది సచివాలయ సెక్రటరీలతో కుమ్మక్కై డబ్బుల కోసం నెలల తరబడి దరఖాస్తులు పరిష్కరించడం లేదని కమిషనర్ వెంకటేశ్వరరావు ఆర్ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఛాంబర్‌లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇకనైనా పనితీరు మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు.

నక్కల రాణిమ్మ కాలనీవాసుల కోసం ప్రత్యామ్నాయ స్థలాలు

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు నగరం, అక్టోబరు 3: ఒంగోలు సమీపంలోని నక్కల రాణిమ్మ కాలనీవాసులకు శాశ్వత గృహాలను నిర్మించేందుకు ప్రత్యామ్నాయ స్థలాలు చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం ఆమె కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో చింతల సమీపంలో ఉన్న నక్కల రాణిమ్మకాలనీని పరిశీలించారు. కాలనీ ఏర్పాటు, కాలనీవాసులు అక్కడ నుంచి ఎందుకు ఖాళీ చేసి వెళ్లిపోయారనే వివరాలను గృహనిర్మాణశాఖ అధికారులను అడిగారు. రెండు, మూడేళ్లపాటు ఇక్కడే ఉన్న గిరిజనులు భారీవర్షాలకు పక్కనే ఉన్న నల్లవాగు పొంగి కాలనీలోకి నీరు చేరటంతో ఖాళీచేసి పోయారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ కాలనీలో మెరక తోలేందుకు, వర్షపు నీరు రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు దాదాపు రూ.1.50 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో వీరికి పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చేందుకు మరోచోట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వారికి సూచించారు. ఇప్పటికే సిద్ధం చేసి ఉంచి లేఅవుట్లలో వీరికి ప్లాట్లను కేటాయించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించారు. వారం క్రితం నక్కల రాణిమ్మకాలనీని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ సందర్శించారు. గిరిజనుల ఆవాసానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాణిమ్మ కాలనీని సందర్శించారు. ఈ ప్రాంతం వారి నివాసానికి ఏమాత్రం యోగ్యంగా లేదని గుర్తించి ప్రత్యన్మాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారి శ్రీనివాసప్రసాద్, ఆర్డీవో సుబ్బారెడ్డి, గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాథరావు, కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు వాసు, మధుసూదనరావు, హౌసింగ్ ఏఈ నాంచార్లురెడ్డి పాల్గొన్నారు.



కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఘనంగా చెన్నై షాపింగ్‌మాల్ ప్రారంభం

● సందడి చేసిన కీర్తిసురేష్

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 3: చెన్నై షాపింగ్ మాల్ 20వ షోరూం ప్రారంభోత్సవం గురువారం ఒంగోలులో ఘనంగా జరిగింది. స్థానిక గుంటూరు రోడ్‌లో ఏర్పాటు చేసిన షోరూంను ప్రముఖ సినీ నటి కీర్తిసురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను చూడటానికి పెద్ద సంఖ్యలో అభిమానులు రావటంతో షోరూం చుట్టుపక్కల ప్రాంతాలు నిండిపోయాయి. ముందుగా షోరూంను ప్రారంభించిన కీర్తి సురేష్ వివిధ విభాగాలను చూస్తూ సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను ఒంగోలు రావటం మొదటిసారి అయినప్పటికీ ఇక్కడి అభిమానుల ఉత్సాహం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అదేవిధంగా షోరూంలో వివిధ విభాగాలలో చిన్నపిల్లల మొదలు పెద్ద వారి వరకు ఎన్నో రకాల వస్త్రాలు, ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో షాపింగ్‌మాల్ నిర్వాహకులు మర్రి జమున, మర్రి వెంకటరెడ్డి, కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.





షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న కీర్తిసురేష్, అనంతరం నిర్వాహకులతో..

చిత్తశుద్ధి గల సీఎం చంద్రబాబు : బీఎన్

నాగులుప్పలపాడు, అక్టోబరు 3: ప్రజల పట్ల చిత్తశుద్ధి గల సీఎం చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గత నెలలో మద్దిరాలపాడులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం ఇచ్చిన హామీలలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేయనున్న నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుకు స్థానిక అంబేడ్కర్ నగర్‌లో గురువారం రాత్రి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం టీడీపీ సీనియర్ నేత గుమ్మడి సాయిబాబా అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మద్దిరాలపాడు రావడం గ్రామస్థులకు వరమన్నారు. మద్దిరాలపాడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సీఎం చర్యలు తీసుకున్నారని, చంద్రబాబు 22 హామీలను ఇవ్వగా పది రోజుల్లో ఏడు హామీలను నెరవేర్చామన్నారు. మిగిలిన పనులు సైతం పురోగతిలో ఉన్నట్లు వివరించారు. ఇల్లు లేక ఎవరూ ఇబ్బందులు పడకూడదని పీఎం ఆవాసనా యోజన కింద మద్దిరాలపాడు చేర్చడం వల్ల గ్రామంలో ఇల్లు లేని వారు ఉండరన్నారు. గుండ్లకమ్మపై చెక్‌డ్యాం నిర్మాణానికి అధికారులు అంచనాలను రూపొందిస్తారని, గ్రామంలో రూ.5.15కోట్లతో రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.93లక్షలతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణ అనురాధ, ఉపసర్పంచ్ పెనుబోతు సునీల్, విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈ మాకినేని హరిబాబు, ఏఈ రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, దివి పున్నారావు, షేక్ ఖాజావలి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి మండల సమావేశం సన్మానాలతో సరి

అభివృద్ధి పనులపై చర్చ జరగని వైనం

ఎమ్మెల్యే సూచించిన పనులను అజెండాలో చేర్చని పాలకవర్గం

మండల అభివృద్ధిలో రాజకీయ ప్రతిష్టంభన

చీమకుర్తి, అక్టోబరు 3: రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయ వనరులన్న మండలాల్లో ఒకటిగా ఉన్న చీమకుర్తి మండల అభివృద్ధిలో మాత్రం రాజకీయ ప్రతిష్టంభన నెలకొంది. దాదాపు రూ.20కోట్ల వరకూ మండల పరిషత్ ఖాతాలో మూలుగుతున్నా వాటిని సమస్యల పరిష్కారానికి ఉపయోగించడంలో రాజకీయ గ్రహణం పట్టింది. మండల ఖాతాలో నిధులున్నాయని నియోజకవర్గానికి మంజూరైన రూ.15కోట్ల ఎన్ఆర్‌జీఎస్ నిధులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చీమకుర్తిని మినహాయించి మిగతా మూడు మండలాలకు కేటాయించారు. మండల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించిన పనులను అజెండాలో చేర్చటానికి వైసీపీ పాలకవర్గం సుముఖత చూపలేదు. గురువారం ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. టేబుల్ అజెండాగా ఎమ్మెల్యే సూచించిన పనులను అజెండాలో చేర్చాలని ఎంపీడీవో రాఘవేంద్ర పాలకవర్గానికి సూచించారు. అయితే పనుల నిర్వహణలో తమ పాత్ర ఏమిటో తేలేదాక ఆమోదం తెలిపేది లేదని పాలకవర్గం తేల్చిచెప్పింది. దీంతో అధికారులు చేసేదేమిలేక మౌనం దాల్చారు. అనంతరం ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీల్లో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లకు విద్యుత్‌శాఖాధికారులు కరెంటు సౌకర్యం కల్పించటంపై మండిపడ్డారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు గ్రామాల్లో పనులు నిర్వహించే సమాచారం తెలియచేయాలని కోరారు. కాగా ఇటీవల బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఎంపీటీసీ వేమా అశ్వని కేవీపాలెంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి సమావేశంలో పాల్గొనకుండా వెళ్లిపోయారు.



గంటాపాలెంలో అమ్మవారు



కొత్తపట్నం బస్టాండులో..



మంగమూరుడొంకలో..



వేడుకల్లో కోలాటమాడుతున్న భక్తులు

బాలాత్రిపురసుందరి పాలయమాం!

వైభవంగా ప్రారంభమైన దేవీ నవరాత్రులు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 3: క్రోధినామ సంవత్సర దేవీ శరన్నవరాత్రులు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులు జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా దేవస్థాన నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా నవరాత్రులు అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఇక తొలిరోజైన అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒంగోలు నగరంలో పలు అమ్మవారి దేవస్థానాలకు మహిళలు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో..

అవీ..ఇవీ..

నేటికి వాయిదా పడిన హైకోర్టు తీర్పు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3 : జిల్లా పరిషత్ అధికారులు, ఉద్యోగుల బదిలీలపై హైకోర్టులో కేసు వాయిదా పడింది. జిల్లా పరిషత్‌లో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హైకోర్టును ఆశ్రయించారు. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ నోట్ అప్రూవల్ తీసుకున్న తర్వాతే బదిలీల ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నా అవేమి పట్టించుకోకుండా బదిలీలు చేశారని వెంకాయమ్మ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో అందుకు సంబంధించి వాదనలు కూడా పూర్తియినట్లు సమాచారం. వాదనలు విన్న హైకోర్టు శుక్రవారానికి తీర్పు వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్యే బీఎన్



ఎమ్మెల్యే బీఎన్‌కు బొకే అందజేస్తున్న ఎస్ఈ వరలక్ష్మి

ఒంగోలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధికి, రైతులకు నీటి ఇక్కట్ల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ కోరారు. రెండు రోజుల క్రితం జలవనరుల శాఖ ఒంగోలు సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన వరలక్ష్మి గురువారం ఎమ్మెల్యే విజయకుమార్‌ను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సందర్భంగా నియోజకవర్గంలో సాగునీటి వనరులు, వాటి నిర్వహణ, తాగు, సాగునీటి ఇక్కట్లు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. వివిధ గ్రామాల్లో ఉన్న చిన్ననీటి వనరులైన సాగునీటి చెరువుల మరమ్మతులపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి ఎంపీడీవోలకు శిక్షణ : సీఈవో

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులకు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఒంగోలులోని పోలీస్ శిక్షణా కేంద్రంలో జిల్లా స్థాయి రిఫ్రెషర్ రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలు, మండల విస్తరణాధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

ఒంగోలు(విద్య), అక్టోబరు 3 : సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సమగ్ర శిక్ష కేజీబీవీఎన్‌టీయూ ఏపీ అధ్యక్షురాలు రత్నమాలదేవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వర్తమాన అంశాలపై అవగాహన అవసరం

ఒంగోలు(విద్య), అక్టోబరు 3 : ఉపాధ్యాయులకు వర్తమాన సమాజంలోని జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అవగాహన అవసరమని ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ ప్రసాదరావు కోరారు. గురువారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కొన్ని దేశాలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయని తెలిపారు. గత ఏడాదిగా జరుగుతున్న యుద్ధాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.విజయసారథి, రాష్ట్ర నాయకులు మంజుల, రఘుబాబు, జనార్దన్‌రెడ్డి, నాయబ్ రసూల్, శేషారావు, తిరుమల, హనుమంతరావు, ప్రసాద్, యోహాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో రైల్వే జీఎం సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: విజయవాడలోని రైల్వే ఎలక్ట్రికల్ ట్రాక్షన్ శిక్షణ సెంటర్‌లో శుక్రవారం జరగనున్న రైల్వేశాఖ జనరల్ మేనేజర్ నిర్వహించే సమావేశంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొనున్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని రైల్వే స్టేషన్ల అభివృద్ధి, కరవది, ఒంగోలు అగ్రహారం గేటు, సూరారెడ్డిపాలెం, టంగుటూరు, పాకల గేటు, సింగరాయకొండ, గిద్దలూరులోని రాచర్ల గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు తదితర సమస్యలను ఈ సమావేశంలో మాగుంట ప్రస్తావించనున్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), అక్టోబరు 3: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మహిళల హక్కులు- కొత్త క్రిమినల్ లా అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోలీస్ శిక్షణ కళాశాల డీఎస్పీ పి.జ్యోతిరాణి మాట్లాడుతూ చట్టాల ద్వారా మహిళలకు ప్రభుత్వం ఆస్తిలో సమాన వాటా, లింగ సమానత్వం, గౌరవంగా, మర్యాదగా జీవించే హక్కు, పనిచేస్తున్న కార్యాలయాల్లో వేధింపుల నుంచి రక్షణ తదితర హక్కులను కల్పించిందన్నారు. ప్రలోభాలకు గురికాకుండా తమ హక్కులను నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ఏవో రమణ, డీన్ వీరాంజనేయులు, సీవీ. సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఒంగోలు నగరం లాయర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం పదిన్నర గంటలకు జిల్లా అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరిస్తారు. ముఖ్యఅతిథులుగా ఒంగోలు నియోజకవర్గ పార్లమెంట్ పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీమంత్రి పేర్ని నాని, జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

ఫారెస్టు అధికారి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న రాజశేఖరరావు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: ఒంగోలు డివిజన్ సోషల్ ఫారెస్టు అధికారిగా కె.రాజశేఖరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకే అందజేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

సంతనూతలపాడు, అక్టోబరు 3: పంచాయతీ కార్యదర్శి గ్రామస్థులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామసభ ఏర్పాటు చేశారని మండలంలోని ఎమ్.వేములపాడు పంచాయతీకి చెందిన వార్డుమెంబరు వడ్డెంపూడిశ్రీనివాసరావు గురువారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీ రమణమ్మకు ఫిర్యాదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభలను పంచాయతీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, డప్పు చాటింపులేకుండా నిర్వహించారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిపై తగుచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి బాణసంచా లైసెన్సులకు దరఖాస్తులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3: దీపావళి పండుగకు బాణసంచాను తాత్కాలికంగా విక్రయించేందుకు శుక్రవారం నుంచి ఈనెల 15వతేదీ వరకు మీ సేవా, గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఆర్వో శ్రీలత తెలిపారు. స్థానిక డీఆర్వో చాంబర్‌లో గురువారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, విపత్తు, అగ్రిమాపక, పంచాయతీశాఖల అధికారులు, మీసేవా ఏజెన్సీ నిర్వహకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దరఖాస్తులను చిరునామా నకలతోపాటు ఆధార్, రూ.10 అఫిడవిట్, వాణిజ్యశాఖ అధికారి ఎన్‌వోసీతో పాటు సంబంధిత పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి తాత్కాలికంగా షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈనెల 29నుంచి 31వతేదీ వరకు బాణసంచా సామగ్రి అమ్మకాలకు అనుమతులు ఇస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాసవీమాతకు శిద్దా పూజలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న శిద్దా దంపతులు

చీమకుర్తి, అక్టోబరు 3 : చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వాసవీమాత ఉత్సవాల్లో తొలిరోజు శ్రీబాలా త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, సతీమణి లక్ష్మీపద్మావతి విశేష పూజలు జరిపారు. భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.


రికార్డులు పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి

పశువైద్యశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

కొండపి, అక్టోబరు 3 : కొండపి పశువైద్యశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కే బేబీరాణి చెప్పారు. పశు సంవర్ధక కార్యక్రమాలపై ఆమె శుక్రవారం మండలంలోని కె. ఉప్పలపాడు గ్రామంలోని వెటర్నరీ వైద్యశాలలో అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా గొర్రెలు, మేకల్లో టీకాల కార్యక్రమం, పశుగ్రాస విత్తనాల ఇండెంట్లు, టీఎంఆర్ దాణా పంపిణీ తదితర శాఖా పరమైన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొండపి ఏరియా పశువైద్యశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కె.ఉప్పలపాడు పశువైద్యాధికారి పేరయ్య, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి స్వర్ణలత

శనగలో విత్తనశుద్ధి ప్రధానం

టంగుటూరు, అక్టోబరు 3 : శనగలో విత్తన శుద్ధి కచ్చితంగా పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జి. స్వర్ణలత చెప్పారు. మండలంలోని అనంతవరం, అదే సచివాలయ పరిధిలోని వెలగపూడిలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేష్‌బాబు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సం, బోరాన్ రైతులకు రాయితీపై అందివ్వాలని రైతులు కోరారు. కార్యక్రమంలో అనంతవరం గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఉప సర్పంచ్ కసుకుర్తి భాస్కర్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు కసుకుర్తి కోటేశ్వరరావు, అలాగే వెలగపూడి గ్రామ సర్పంచ్ ఆలం కృష్ణారావు, మాజీ సర్పంచ్ కోటపాటి వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు లింగరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పృథులగిరి బయలుదేరిన ఉత్సవ మూర్తులు

పృథులగిరిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్రిపూడి. అక్టోబరు 3 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దసరా బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. చిమట, కాకర్లకు గ్రామాలకు చెందిన పొతకమూరి వంశస్థులు శాశ్వత ఉభయదాతలుగా బ్రహ్మోత్సవాల్లో పాలుపంచుకోవడం ఆనవాయితీ. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉన్న లక్ష్మీనరసింహుని ఉత్సవమూర్తులను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. విజయదశమిరోజు శాంతి కల్యాణం జరగనుంది. ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల తిష్ఠ

శిథిల, అద్దె భవనాల్లోనే పలు కేంద్రాలు

కొన్నిచోట్ల అసంపూర్తి భవన నిర్మాణాలు

అవస్థలు పడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

సంతనూతలపాడు, అక్టోబరు 3: నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతగూడు లేక అసౌకర్యాలన నడుమ చిన్నారులతో పాటు నిర్వాహకులు ఇబ్బందిపడుతున్నారు. కొన్ని చోట్ల గాలి, వెలుతురు రాని అద్దె భవనాల్లోనే కేంద్రాలు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ పాలనలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించే అంగన్‌వాడీ కేంద్ర భవనాలపై దృష్టి సారించలేదు. శిథిలావస్థకు చేరిన వాటికి మరమ్మతులు చేయించలేదు. పలుచోట్ల శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉన్నా నాడు స్పందించే పరిస్థితే కనబడలేదు. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు మండలాల్లో మొత్తం 286 అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో సొంతభవనాలు 135 భవనాలు ఉండగా, అద్దెభవనాలు 101 ఉన్నాయి. అద్దెలేని ప్రభుత్వ భవనాలు 50 ఉన్నాయి. 9 నూతన భవనాలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. 17 భవనాలకు చిన్నచిన్న మరమ్మతుల కోసం ప్రతిపాదన పంపారు.


మద్దిపాడు మండలం పెదకొత్తపల్లిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

పలు కేంద్రాల్లో సమస్యలు

సంతనూతలపాడు మండలంలో కొన్ని అంగన్‌వాడీ భవనాలు ఇరుకుగా మారడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల సరైన వెలుతురు కూడా ఉండటం లేదు. మద్దిపాడు మండలంలో సైతం పెచ్చులు ఊడేవిధంగా, స్లాబు చువ్వలు బయటకు వచ్చిన కేంద్రాల్లో భయంభయంగా గడుపుతున్నారు. మరికొన్నింటికి నిర్మాణాలు సగంలో ఆగిపోగా, మరికొన్ని కేంద్రాలకు కిటికీలు, తలుపులు కూడా లేని పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

చీమకుర్తి, నాగులుప్పలపాడు మండలాల్లో సైతం ఇదే పరిస్థితి దర్శనమిస్తోంది. గత ప్రభుత్వం మాత్రం అద్దె ఇవ్వడానికైన నాడు మొగ్గుచూపింది కానీ అసంపూర్తిగా ఉన్న భవనాలను నిర్మిద్దామనే ఆలోచన అయితే చేయలేదు. కొన్ని చోట్ల శిథిల భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తుండటంతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అంగనవాడీ కేంద్రాలకు బాలింతలు, గర్భిణులు రావడానికి విముఖత చూపిస్తున్నారు. ఎవరైన ఉన్నతాధికారులు విజిట్‌కు వచ్చినపుడు, శిథిలభవనాల కేంద్రాలకు బాలింతలను, గర్భిణులను బతిమిలాడి తీసుకుని రావాల్సిన పరిస్థితి సిబ్బందికి ఏర్పడుతోంది. మరికొన్ని చోట్ల అద్దెభవనాల్లో ఇరుకుగా ఉండటంతో లబ్ధిదారులకు సరఫరా చేసే పాలు, పోషకాహారం, స్నాకులు, పిల్లల ఆట వస్తువులను భద్రపరిచేందుకు ఇబ్బందిపడాల్సి వస్తోంది.

పరిశీలించి తగిన సౌకర్యాలు కల్పిస్తున్నాం

-పి.ఇవాంజిలిన్, సీడీపీవో

ప్రతి నెలా కొన్ని చోట్ల అసంపూర్తి, అలాగే శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం నివేదికలను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. కొన్ని కేంద్రాల్లో ఇబ్బందులు ఉన్న చోట వాస్తవమే. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అక్కడ పరిస్థితులను బట్టి కేంద్రాలను నిర్వహించాలని సిబ్బందికి తెలిపాం. అద్దె బకాయిలను చెల్లిస్తున్నాం, నాడు-నేడు పనుల్లో భాగంగా కొన్ని భవనాలు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలు కొంతవరకు పూర్తయ్యాయి.


నిరసన దీక్షలో మాట్లాడుతున్న రంగారావు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

● రైతు సంఘాల నాయకుల హెచ్చరిక

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 3 : అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణను అడ్డుకుంటామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట గురువారం జరిగిన దీక్షకు రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పమిడి వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.వీరారెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వ్యవహరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ 32 మంది విద్యార్థుల బలిదానంతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఆంధ్రప్రజలు సాధించుకున్నారన్నారు. అటువంటి ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్రపన్నిందని, ఈ విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కె.వీరారెడ్డి మాట్లాడుతూ ఉక్కుఫ్యాక్టరీని కేవలం రూ.1300 కోట్లకు కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. పమిడి వెంకట్రావు మాట్లాడుతూ విశాఖ ఫ్యాక్టరీకి ముడిసరుకు తగినంత అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. రంగా కిసాన్ సంస్థ ప్రధానకార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి తొలగించిన నాలుగువేల మంది ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమలో నాయకులు చావలి సుధాకరరావు, బి.సుబ్బారావు, జె.జయంతిబాబు, ఎస్‌కే.మౌలాలి, జీవీ.కృష్ణయ్య, దాసరి సుందరం, ధరణికోట లక్ష్మీనారాయణ, పల్లెపాటి పేరయ్య, పిన్నిక శ్రీనివాసరావు, ఎస్‌కే.సైదా, కొత్తకోట వెంకటేశ్వర్లు, కోడూరి నాంచార్లు, రామారావు, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు దామచర్ల సత్య, నేతలు

పోర్టుల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు

టీడీపీ నేత దామచర్ల సత్య

మద్రిపూడి, అక్టోబరు 3 : రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని మారిటైన్ బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. గురువారం మద్రిపూడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుజరాత్ తరువాత రాష్ట్రంలోనే 980 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం కలిగి ఉండటం మన అదృష్టమన్నారు. సముద్రతీర ప్రాంతాలలో ఓడరేవులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రామాయపట్నం పోర్ట్ నిర్మాణ పనులు 50శాతం పూర్తి అయ్యాయన్నారు. బందరుపోర్ట్, శ్రీకాకుళం భావనంపాడు పోర్ట్ నిర్మాణ పనులు 25శాతం పూర్తయ్యాయని, అసంపూర్తిగా ఉన్న పోర్ట్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి సరుకురవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని చెప్పారు. రాష్ట్రంలో 14 ఫిషింగ్ హార్బర్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. చీరాల ఓడరేవు, కొత్తపట్నం, జువ్వలదిన్నె, నిజాంపట్నం హార్బర్లను త్వరలో వినియోగంలోకి తెస్తామన్నారు. పాకలలో మినీ ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు.

పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తోపాటు పాకల బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. సంగమేశ్వరం ప్రాజెక్టును అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తానని యువగళం పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారని, ఆ మేరకు త్వరలో డీపీఆర్ సిద్ధమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో మద్రిపూడి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో సాగు, తాగునీటి సమస్య తీరుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మద్రిపూడి మండలంలో గత ఎన్నికల్లో టీడీపీకి మంచి మెజారిటీ లభించిందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తనతోపాటు మంత్రి స్వామి పనిచేస్తామని హామీ ఇచ్చారు. మద్రిపూడి చెరువుకు సాగర్ కుడికాలువ ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసి నీరు అందించేందుకు మంత్రి లోకేశ్ ద్వారా కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 5న మంగళగిరి రాయల్ కన్వెన్షన్ హాలులో మారిటైంబోర్డ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నానని, నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఆశీర్వదించాలని కోరారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో సత్యకు స్వాగతం పలకారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, పొదిలి మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, రేగుల వీరనాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, సారెడ్డి యోగిరెడ్డి, పుల్లారెడ్డి, గొంటు హనుమారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాగర్లమూడి రామారావు, వైవెంకటరెడ్డి, రాజేష్, బాబురావ్, బాలకోటయ్య పాల్గొన్నారు.

రేపు బాధ్యతలు చేపట్టనున్న సత్య

టంగుటూరు, అక్టోబరు 3 : ఏపీ మారిటైం బోర్డు చైర్మన్‌గా మండలంలోని తూర్పునాయుడుపాలెంకు చెందిన దామచర్ల సత్య ఈనెల 5న బాధ్యతలు చేపట్టనున్నారు. మంగళగిరిలోని రాయల్ కన్వెన్షన్ హాల్ (బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన) బాధ్యతల స్వీకరించనున్నారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారని, మండలంలోని టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని టంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.




మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

నీటి సంరక్షణ పనులను గుర్తించాలి

ఒంగోలు(రూరల్), అక్టోబరు 3: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా నీటి సంరక్షణ పనులు గుర్తించాలని ఏపీడీ పి.వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు మండలం ఉలిచి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీలు ఎక్కువ మంది పాల్గొన్నాలని కోరారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి పనులు ఎంతగానో ఉపయోగపడతాయని, గ్రామస్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో పి.వెంకటరావు టీఏ నాగరాజు, సర్పంచ్ మంచు మురళి, నాయకులు చుంచు సింగయ్య, పంచాయతీ కార్యదర్శి కాంచన పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమారుడికి కారుణ్య నియామకం

ఒంగోలు(క్రైం), అక్టోబరు 3: పోలీస్‌శాఖలో పనిచేస్తూ మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి కారుణ్యనియామకం కింద ఉద్యోగం ఇస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ ఉత్తర్వులు ఇచ్చారు. 2023లో గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.నారాయణరావు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుమారుడు అనిల్‌కుమార్‌కు పోలీసు శిక్షణ కళాశాలలో టైపిస్టుగా నియమిస్తూ గురువారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆయనకు నియామకపత్రం అందజేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, సమర్థవంతగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ సూచించారు.

ఇరువురు ఎస్‌ఐలకు పోస్టింగ్

ఒంగోలు(క్రైం), అక్టోబరు3: జిల్లాలో ఇరువురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ దామోదర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న బి.ప్రేమ్ కుమార్‌ను కొండపి ఎస్‌ఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎం.ఖాసీమ్ బాజీ బాబును వీఆర్‌కు పిలిచారు. అదేవిధంగా వీఆర్‌లో ఉన్న వి.అజయ్‌బాబును సంతనూతలపాడుకు బదిలీ చేయగా అక్కడ ఉన్న దేవకుమార్‌ను వీఆర్‌కు పంపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దిపాడు, అక్టోబరు 3: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శి మాధవి పేర్కొన్నారు. గురువారం వెల్లంపల్లిలో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై చెత్తాచెదారం వెయ్యకూడదని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం

● తప్పిన ప్రమాదం

జరుగుమల్లి(కొండపి), అక్టోబరు 3 : వానగాలికి గురువారం సాయంత్రం మండలంలోని కామేపల్లి సమీపంలోని మూలమలుపు వద్ద వ్యవసాయ కనెక్షన్‌తో కూడిన విద్యుత్ స్తంభంపై వేపకొమ్మ పడటంతో స్తంభం విరిగిపోయింది దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలు నేలకు 4 అడుగుల ఎత్తులో వేలాడుతుండడంతో రెండువైపులా వాహనదారులు భయంతో ఆగిపోయారు. స్తంభం పడిన సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు, జనం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న కామేపల్లి సబ్‌స్టేషన్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను ఆపివేశారు. కామేపల్లి లైన్‌మెన్ ఎస్.వి.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి వైర్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.


విద్యుత్ తీగలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కొండపిలో మోస్తరు వర్షం

కొండపి : కొండపి ప్రాంతంలో పదిరోజులుగా తీవ్రమైన ఎండలు కాశాయి. బుధ, గురువారాలు ఓమోస్తరు వర్షం కురిసింది. గురువారం సాయంత్రం బలంగా వర్షం పడింది. కామేపల్లి, నేతివారిపాలెం, కొండపి పరిసర గ్రామాల్లో పొలాల్లో నీళ్లు నిలిచాయి.



బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో వల్లూరమ్మ

వల్లూరు(టంగుటూరు), అక్టోబరు 3 : దసరా శరన్నవరాత్రోత్సవాలు మండలంలోని వల్లూరులో వేంచేసిఉన్న శ్రీవల్లూరమ్మ దేవస్థానంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వల్లూరమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అంతా ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణలతో ధగధగలాడుతోంది. దశమి 12వ తేదీ వరకు వల్లూరమ్మవారికి శరన్నవరాత్రోత్సవాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, వాహన పూజలు విద్యుత్ దీపతోరణాలతో అత్యంత శోభాయమానంగా జరుగుతున్నాయి.

'కిమ్స్'లో అరుదైన శస్త్రచికిత్స

ఒంగోలు(రూరల్), అక్టోబరు 3: ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలలో ఓ వృద్ధుడికి (76) అధునాతన వైద్యపరికరాలతో ఆపరేషన్ లేకుండా అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కపిల్‌కార్తికేయరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కిమ్స్ వైద్యశాల కాన్ఫరెన్స్‌హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండె కవాటాలు మూసుకుపోయని ఓ వ్యక్తి తమ వైద్యశాలలో చేరారని చెప్పారు. ఆయనకు గతంలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిందని, అయితే గుండెలోని అయోర్టిక్‌వాల్వ్ కవాటం పూర్తిగా దెబ్బతిని పోవడటమే కాకుండా ఊపిరితిత్తుల సమస్య కూడా ఉందని పేర్కొన్నారు. ఈక్రమంలో మూసుకుపోయిన గుండె కవాటాలను ఎలాంటి ఆపరేషన్ లేకుండా ట్రాన్స్‌కాథటర్ అయోర్టిక్ వాల్ రీప్లేస్‌మెంట్ అధునాతన చికిత్స చేసి రోగికి ఎలాంటి ప్రాణ హాని లేకుండా చేసినట్లు తెలిపారు. రెండో రోజుల్లో రోగి ఆరోగ్యంగా కోలుకున్నారన్నారు. దేశంలోని మెట్రోనగరాలలో కంటే ఇక్కడ మూడోవంతు ఖర్చు తక్కువతోనే ఈ వైద్యం అందించామని తెలిపారు. కిమ్స్ సీఈవో అంకిరెడ్డి మాట్లాడుతూ తమ వైద్యశాలలో త్వరలో కేన్సర్ వైద్యసేవలు కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీహరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న డాక్టర్ కపిల్ కార్తికేయరెడ్డి

పర్యావరణాన్ని పరిరక్షించాలి

మద్దిపాడు, అక్టోబరు 3: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల మానవ మనుగడకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు మండవ గోవిందరాజు, రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, ఫీల్డ్ ఆఫీసర్ నాయక్, బోయపాటి వెంకయ్య చౌదరి, నారిపెద్ది వరహాలుచౌదరి, రావి ఉమామహేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

కొండపి, అక్టోబరు 3 : రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొండపి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో కె. రామకృష్ణ చెప్పారు. గురువారం మధ్యాహ్నం మండల పరిషత్ సమావేశంహాలులో గోకులం షెడ్ల లబ్ధిదారుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోకులాలు పశుపోషకులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మహాలక్ష్మి మాట్లాడుతూ గోకులం షెడ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలన్నారు. సమావేశంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇలవరలో 'పొలం పిలుస్తోంది'

కొండపి, అక్టోబరు 3 : మండలంలోని ఇలవర(నేతివారిపాలెం) గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవనశాఖ అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో కలిగే లాభాలను అధికారులు వివరించారు. జీవామృతం తయారీ విధానాన్ని, దాని వాడకం వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి డి. విజయకుమార్, వీఏఏ డి. శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారిణి ప్రత్యూష, ఎంపీఏవో సుజాత, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది మందాకిని, జ్యోత్స్న, జీకే మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

కొండపి, అక్టోబరు 3 : కొండపి తహసీల్దార్ పి.మురళి చాణక్య జూనియర్ కళాశాలను గురువారం సందర్శించి ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఓటుహక్కు పొందేవిధానం, ఓటుహక్కు వినియోగం, ఓటరు కర్తవ్యాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు, ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎరిక్షన్‌బాబు, రాజరాజేశ్వరిగా వాసవీమాత, పుల్లలచెరువులో దుర్గాదేవిగా, మార్కాపురంలో భక్తుల పూజలు, వాసవీమాత

- త్రిపురాంతకంలో ఎరిక్షన్‌బాబు ప్రత్యేక పూజలు
- విశేషంగా ఆకట్టుకున్న అలంకరణలు
- అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

త్రిపురాంతకం, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రులు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి ఆలయాల్లో గురువారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల ఆలయాలలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం నుండి మంగళవాయిద్యాలు, అభిషేకాలు, ప్రాతఃకాలపూజ, గణపతిపూజ, అఖండ స్థాపన, సప్తశతి పారాయణం, మండపారాధన, పల్లకిసేవ, బాలపూజ, ప్రదోష కాలపూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు దూపాటి పాలంక ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి, వేదపండితులు ఫణీంద్రకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అంకురార్పణ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పల్లకీలో ఆలయ ఉత్సవం నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎర్రగొండ పాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎరిక్షన్‌బాబుకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అమ్మవారి పల్లకి సేవలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పాలకమండలి సభ్యులు, ఉభయ దాతలు పాల్గొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాలను ప్రారంభించారు.

శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు

త్రిపురాంతకం : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మొదటిరోజు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణీదేవి అలంకారంలో హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పెద్ద దోర్నాల : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో, తిమ్మాపురం గ్రామంలోని శ్రీచౌడేశ్వరీ దేవాలయంలో, మోట్ల మల్లికార్జున స్వామి దేవాలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శరన్నవరాత్రుల ఉత్సవా లను గురువారం ప్రారంభిం చారు. ఆయా ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాల యంలో మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు బిదరే రాంప్రసాద్‌శర్మ శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ రూపంలో అలంకరించారు. మోట్ల మల్లికార్జున స్వామి దేవాలయం లో ఆలయ అర్చకులు అశ్వనీకుమార్ అమ్మవారిని కవచలంకృత భ్రమరాంబికాదేవి అలంకారంలో, తిమ్మా పురంలోని చౌడేశ్వరీ దేవాలయంలో మణిశర్మ అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గీతాలాపనలతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

కంభం : కంభం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో 3న గురువారం నుంచి దసర శరన్నవరాత్రులు ప్రారంభమైనట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. 3 నుంచి 14వ తేదీ వరకు అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిస్తారన్నారు. 3న గురువారం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అలంకరణ 4న అన్నపూర్ణదేవి, 5న భువనేశ్వరిదేవి, 6న రాజరాజేశ్వరిదేవి, 7న గజలక్ష్మీదేవి, 8న పార్వతిదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహంకాళిదేవి, 12న విజయలక్ష్మీదేవి, 13న మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాజరాజేశ్వరిదేవిగా అలంకరణ

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దేవస్థానంలో అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ పతాక ఆవిష్కరణ చేసి నవరాత్రులను ప్రారంభించారు. వందలాది మంది మహిళలు సామూహికంగా గంగా జలంతో వచ్చి అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ముత్తైదువులు కళశాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అంకాలమ్మ దేవాలయంలో, సాయిబాబా మందిరంలో, కనకదుర్గ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. షరాఫ్ బజారులో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా తొలి రోజు స్వామి విష్ణుమూర్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, హోమం, పూలంగిసేవ, పవలింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు.

పుల్లలచెరువు : పుల్లలచెరువులోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలోని అమ్మవారి మొదటి రోజు శ్రీస్వర్ణ కవచంకృత అమ్మవారిగా దర్శనం ఇచ్చారు. గురువారం పుల్లలచెరువులో దేవి శరన్నవరాత్రులు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా మహాగణపతి పూజ, పుణ్యావాచనము, అఖండ దీప ప్రజ్వలన, శ్రీ చక్ర యంత్ర అధిష్టాన దేవతలకు పంచాభిషేకములు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రులు మార్కాపురం పట్టణంలో వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మార్కాపురంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిమాతగా, శివాలయంలో జగదాంబ శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లకు పూజలు చేశారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని జమ్మనపల్లి గ్రామ ఇలాకాలోని ముద్దసానమ్మ ఆలయంలో దసరా నవరాత్రులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల ప్రారంభోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. గురువారం నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు నివేదన హారతులతో పాటు చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాకులు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం సువాసిని పూజ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఫ్రీజర్ బాక్సుల కోసం రూ.75వేలు వితరణ

పొదిలి, అక్టోబరు 3 : మానవత స్వచ్ఛందసేవ సంస్థకు ఫ్రీజర్ బాక్స్ కొనుగోలుకు హౌసింగ్ మాజీ ఏఈ చప్పిడి రామలింగయ్య భార్య ఝాన్సీలక్ష్మీ జ్ఞాపకార్థం రూ.75వేల చెక్కును అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావుకు గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు మృతి చెందితే మృతదేహాన్ని భద్రపరచడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలా ఎవరు ఇబ్బందులు పడకూడదని తనవంతుగా సంస్థకు సహాయం అందిస్తున్నానన్నారు. సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పొదిలి ఏఎంసీ మాజీ చైర్మన్ చప్పిడి పెద్ద రామ లింగయ్య, మానవత స్వచ్ఛందసేవ సంస్థ నాయకులు కాటూరి పెదబాబు, యర్రంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, చిరంజీవి, తన్నీరు సుబ్బయ్య, గుత్తా శ్రీనివాసులు, పమిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 3: రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సాంఘిక సంక్షేమశాఖామాత్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిలను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గురువారం అమరావతిలోని వారి క్యాంపు కార్యాలయాల్లో కలిశారు. మంత్రి కొల్లు రవీంద్రతో ఇసుక వలన ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించారు. మార్కాపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పలకల పరిశ్రమకు రాయల్టీ ఫీజులు తగ్గించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి కోరారు. ప్రధానంగా ఇసుక టన్నేజీ విషయంలో స్పష్టత లేకపోవడంతో టన్ను ధర రూ.2వేల వరకు పడుతోందన్నారు. దీంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయని, పర్యవసానంగా కూలీలకు పనిదొరక్క అవస్థలు పడాల్సివస్తోందని తెలియజేశారు. స్పందించిన మంత్రి రవీంద్ర టన్నేజీతో సంబందం లేకుండా ఇసుక తీసుకువెళ్లేలా త్వరలోనే ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పలకల పరిశ్రమకు సంబందించి రాయల్టీ తగ్గించేందుకు తప్పక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమాత్యులు స్వామిని జిల్లా ఎమ్మెల్యేలు పలువురితో కలిసి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు సమస్యలను గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంత్రికి తెలియజేశారు.


మంత్రి రవీంద్రతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మాజీ ఎమ్మెల్యే కేపీకి మాతృ వియోగం


నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం, అక్టోబరు 3: మార్కాపురం ప్రాంత సీనియర్ రాజకీయ నాయ కులు, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి మాతృమూర్తి చెంచమ్మ (98) గురువారం వేకువ జామున అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని కొండేపల్లి గ్రామంలో మూడవ కుమారుడి వద్ద ఉంటున్న ఆమె కొద్దిరోజుల క్రితం వయోభారంతో అనారోగ్యానికి గురై మృతిచెందారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు, మార్కాపురం, కంభం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు చెంచమ్మ మృత దేహానికి నివాళులు అర్పించారు.

ర్యాగింగ్ ఉచ్చులో పడొద్దు

మార్కాపురం, అక్టోబ రు 3: విద్యార్థులు ర్యాగింగ్ ఉచ్చులోపడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని మార్కాపురం రూరల్ ఎస్సై పి.అంకమ్మరావు అన్నారు. స్థానిక జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్ కన్వెన్షన్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై అంకమ్మరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో కళాశాలలో ఉన్నత విద్య కోసం పిల్లలను పంపుతున్నారన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌లాంటి వికృత పోకడలకు పోకుండా, సమున్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాల న్నారు. ఈ సందర్భంగా ఏబిసీటీఈ ఆన్లైన్ అఫిడవిట్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ మస్తానయ్య, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3: ఉచిత ఇసుక సరఫరా హామీని అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సోమయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని హామీ ఇచ్చి 120 రోజులు గడిచిందని, హామీ అమలు జరుగకపోగా రూ.1100 ధర ఉన్న టన్ను ఉన్న ఇసుక ఈరోజు రూ.2000లకు చేరకుందన్నారు. అయినా ఇసుక అందుబాటులో లేదని భవన నిర్మాణ రంగంలో పనులు నిలిచిపోయాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలనాగయ్య, డీకేఎం రఫీ, రాజు, ఏనుగుల సురేష్, కరిముల్లా, నన్నేసా, భవన నిర్మాణ కార్మికులు ప్రసాద్, శివారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మార్కాపురం రూరల్, అక్టోబరు 3 : మండలంలోని బొందలపాడు గ్రామ పొలాల్లో ప్రమాదవశాత్తు రైతు మారం రెడ్డి సుబ్బారెడ్డి (45) మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సుబ్బారెడ్డి సాగు చేస్తున్న పత్తి పొలానికి వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం వెళ్లాడు. ఆయన సాగుచేస్తున్న పొలం మీదుగా విద్యుత్ మెయిన్ లైన్ వెళుతోంది. ఆ విద్యుత్ తీగలు తెగి పొలానికి ఏర్పాటు చేసిన సోలార్ తీగలపై పడ్డాయి. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే సమయంలో గమనించక పొలానికి ఏర్పాటు చేసిన సోలార్ తీగ ప్రమాద వశాత్తు తాకాడు. దానికి విద్యుత్ ఉండడంతో పొలం వద్దే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సుబ్బారెడ్డికి భార్య లక్ష్మమ్మ ఉన్నారు. సుబ్బారెడ్డి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రూరల్ ఎస్సై అంకమ్మరావు ప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును, వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు.

జాతీయ రహదారి వెడల్పు తగ్గించాలి

- సబ్ కలెక్టర్‌కు విన్నవించుకున్న బాధితులు


బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

బేస్తవారపేట, అక్టోబరు 3: అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో భాగంగా చేపట్టిన రహదారి విస్తరణ పనులు బేస్తవారపేట పట్టణంలో నిలిచాయి. దీనిపై గురువారం మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్ వెంకట త్రినాగ్ బేస్తవారపేటలోని జాతీయ రహదారికి ఇరువైపుల భవనాలను పరిశీలించారు. అయితే గతంలో జాతీయ రహదారి అధికారులు 80 అడుగులు మాత్రమే రోడ్డు తీసుకుంటున్నామని చెప్పారు. ఆ రోజుల్లో పట్టణంలోని ప్రజలు అంగీకరించామని, కాని ఇప్పుడు 100 అడుగులు తీసుకుంటామంటే రోడ్డుకు ఇరువైపుల భవనాలు పెద్దఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉందని సబ్ కలెక్టర్ ఎదుట బాధితులు వాపోయారు. గతంలో చెప్పిన విధంగా మాత్రమే రోడ్డు వెడల్పు తీసుకోవాలని లేదంటే పాత సినిమాహాల్ దగ్గర నుంచి ఒంగోలు రోడ్డు వరకు ఉన్న వెడల్పు రహదారిలో జాతీయ రహదారిని మార్చాలని అందుకు ప్రతిపాదనలు పంపాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, సర్వేయర్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహణ


వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఐవీ సుబ్బారావు

మార్కాపురం, అక్టోబరు 3: మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సహకారంతో నంద్యాలకు చెందిన శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో పశ్చిమ ప్రకాశం వెనుకబడి ఉందన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా దూర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందన్నారు. ఇలాంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో డివిజన్‌లోని ఎర్రగొండపాలెం, గిద్దలూరు ప్రాంతాల్లో కూడా శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మొత్తం 100 మంది రోగులకు పరీక్షలు చేయగా 60 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ త్వరలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని శాంతిరామ్ మెడికల్ కళాశాల ప్రతినిధి ఆది తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ రమణ, డి.కనకయ్య, పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మార్కాపురం, అక్టోబరు 3: మార్కాపురం పట్టణంలోని శివారు ప్రాంతమైన ఇందిరమ్మ కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని గురువారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,650ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

కిట్స్‌లో రక్తదాన శిబిరం

మార్కాపురం, అక్టోబరు 3: స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆపద్బంధు బ్లడ్ సెంటర్ సహకారంతో క్యాంప్ నిర్వహించామన్నారు. మొత్తం 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రంగనాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

గుండ్లమోటులో వెలిగొండ నీటిని కలపాలి


డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గిద్దలూరు, అక్టోబరు 3 : మండలంలోని కొత్తకోట పంచాయతీలో నిర్వహించిన గ్రామసభకు వెలుగొండ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి హాజరయ్యారు. తాగు, సాగునీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రైతులు డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతాల నుంచి కాలువ ద్వారా కడప జిల్లాకు కృష్ణాజలాలను పంపించే విధంగా సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల వారికి నీరు ఇవ్వకుండా చెరువులను నింపే ఏర్పాట్లు చేయకుండా కాలువలు నిర్మించడంతో కడప జిల్లాకు మినహా గిద్దలూరు ప్రాంత రైతాంగానికి ఎటువంటి మేలు చేకూరదని రైతులు వాపోయారు. వెలిగొండ ప్రాజెక్టు నీటిని గుండ్లమోటు ప్రాజెక్టుకు చేరిస్తే అక్కడి నుంచి కాలువలను జిల్లా సరిహద్దు ఆదిమూర్తిపల్లి వరకు ఏర్పాటు చేస్తే దాదాపు 75శాతం గిద్దలూరు మండలానికి తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గిద్దలూరు మున్సిపాలిటీకి కూడా తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొంటూ వినతిపత్రం అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

గిద్దలూరు, అక్టోబరు 3 : మండలంలోని కంచిపల్లి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పాల్ అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా తోటి ఫొటోగ్రాఫర్లు స్పందించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రతినిధులు ప్రభాకర్, శరత్‌బాబు, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

నేటితో ముగిసిన పొగాకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

పొదిలి, అక్టోబరు 3 : పొగాకు వేలం ప్రక్రియ గురువారంతో ముగిసిందని వేలం నిర్వాహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది 4332 మంది రైతులు 14.73 మిలియన్ కిలోల పొగాకును విక్రయించారన్నారు. ఇందులో 9.65 మిలియన్ కిలోల పొగాకు అనుమతిమేర పండించగా అధనంగా 5.15 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి చేశారు. మొత్తం రూ.388కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. 164 రోజులపాటు జరిగిన వేలం ప్రక్రియలో సగటు ధర రూ.263.79 దక్కింది. 47 మంది వ్యాపారవేత్తలు వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. అత్యధిక బిడ్ 364 కాగా, అత్యల్ప బిడ్ రూ.40 లభించింది. వేలం ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన రైతులు, వ్యాపారులు, సిబ్బందికి వేలం నిర్వహణ అధికారి జి.గిరిరాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న జనసేన నాయకులు

గిద్దలూరు, అక్టోబరు 3 : స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను రాచర్ల మండల జనసేన పార్టీ నాయకులు నిర్వహించారు. స్థానిక అమ్మ ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శంకర్‌నాయుడు, అలిశెట్టి వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి వెంకటరావు, శేఖర్, అమ్మ ఆశ్రమం నిర్వాహకులు తిరుపతమ్మ పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం


చెక్కును అందజేస్తున్న మందిర కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3: మార్కాపురంలోని నెహ్రూబజార్ షిరిడీ సాయి మందిర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి రూ.25వేల చెక్కును గురువారం అందించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

6న ఉచిత వైద్యశిబిరం

గిద్దలూరు, అక్టోబరు 3 : నంద్యాలకు చెందిన ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గిద్దలూరులోని డీజీఆర్ ఆసుపత్రి ఆవరణలో ఈ నెల 6న ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచితమెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ఎస్.భారతి శిబిరానికి హాజరై రోగులను పరీక్షిస్తారని, ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పొదిలి ఎంపీడీవోగా శోభన్‌బాబు



పొదిలి, అక్టోబరు 3 : పొదిలి నూతన ఎంపీడీవోగా జి.శోభన్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో దర్శి ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో పొదిలికి వచ్చినట్లు ఆయన చెప్పారు. మండలంలో ఉన్న సమస్యలను తెలుసుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

విధుల్లో చేరిన నూతన ఎంపీడీవో రాజ్‌కుమార్


ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీ

త్రిపురాంతకం : మండలానికి నూతన ఎంపీడీవోగా వచ్చిన రాజ్‌కుమార్ గురువారం విధుల్లో చేరారు. పెద్దారవీడులో పనిచేస్తూ బదిలీపై వచ్చిన ఆయనను ఎంపీపీ జి.రిబ్కా, కార్యాలయ సిబ్బంది, నాయకులు సన్మానించారు.

రెండురోజుల పాటు బస్‌పాసుల నిలిపివేత

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3: మార్కాపురం డిపో పరిధిలోని ఆర్టీసీ బస్ కౌంటర్‌లో ఈనెల 5, 6 తేదీలలో బస్‌పాస్ కార్యక్రమాలు నిలిపివేస్తున్నట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ పాస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా కార్యకలాపాలు నిలిపివేస్తున్నామన్నారు. 7వ తేదీ సోమవారం నుంచి బస్‌పాస్‌లు యధావిధిగా అందిస్తామన్నారు. విద్యార్థులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ఆర్టీసీకి సహకరించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీసీపల్లి, అక్టోబరు 3: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ మంజుల అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో నివాస ప్రాంతాల సమీపంలో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తమ పరిధిలో ఉన్న జ్వర పీడితులను గుర్తించి స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

పీసీపల్లి, అక్టోబరు 3: ఆధునిక పద్ధతులతో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ షారూఖ్ అన్నారు. గురువారం మండలంలోని నేరేడుపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడడం వల్ల పంటలకు తెగులుసోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులను వాడవద్దని సూచించారు. సాధ్యమైనంత వరకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా చీడపీడలను నివారించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య, అఖిల్, సర్పంచ్ పల్లా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి

ముండ్లమూరు, అక్టోబరు 3: మండలంలో వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్, వాహన పత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. లేకుంటే వాహన చోదకులపై కేసులు నమోదు చేయటమే కాక అపరాధ రుసుం విధిస్తామన్నారు. గురువారం ముండ్లమూరులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు ఎక్కువ మందిని ఎక్కించు కోవటంవల్ల ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో గ్రామాల అభివృద్ధి

ముండ్లమూరు, అక్టోబరు 3: మహాత్మాగాంధీ జాతీయ హామీ పథకం కింద గ్రామాలకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేయనున్నట్టు ఎంపీడీవో ఆర్. జనార్దన్ అన్నారు. గురువారం మండలంలోని పెదఉల్లగల్లులో సర్పంచ్ జనమాల నాగేంద్రం ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం మంజూరుచేసిన ఉపాధి నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తామన్నారు. అందులో కొంతమంది జాబ్ కార్డు ఉన్న కూలీలకు కూడా పనికల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో ప్రధానంగా ఏది అవసరమో గుర్తించి మొదటి ప్రాధాన్యత ఆపని చేసేటట్లుగా ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాజ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాగులచెరువు ఆధునికీకరణకు శ్రీకారం

కనిగిరి, అక్టోబరు 3: కనిగిరిలో దశాబ్దకాలంగా నాగులచెరువు కబ్జా, ఆక్రమణలతో చుక్కనీరు రాక నిరుపయోగంగా మారింది. ఈక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. కనిగిరి ప్రాంతంలో ఏర్పాటవుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మట్టి అవసరమై ఉంది. దీంతో ఆయా పనులను కాంట్రాక్టు పొందిన సంస్థ నాగులచెరువు నుంచి మట్టిని తోలుకునేందుకు కోరింది. దీంతో ఎమ్మెల్యే నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్‌లతో నాగులచెరువును పూడికతీత పనులు, గోతులు లేకుండా, జంగిల్ క్రియరెన్స్ పనులు చేపట్టి ఆయా చెరువులో మట్టిని తోలుకుని ట్యాంకు మాదిరిగా చేయాలని సూచించారు. చెరువులో ఆక్రమణలను తొలగించి వాగు, వంకల నుంచి గతంలో మాదిరిగి నీరు చేరేలా కాలువ పనులు చేపట్టాలని కోరారు. అందుకు ఒప్పుకున్న నిర్మాణ సంస్థ నిర్వాహకులు ఆగమేఘాలపై నాగులచెరువు ఆధునికీకరణ పనులను గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు.

దశాబ్దకాలంగా కనిగిరి పట్టణ పరిస రాల్లో భూగర్భ జలాలు అడుగంటి ఇంటి మోటార్లు నిరుపయోగంగా మారాయి. నాగులచెరువు ఆధునికీకరణ పనులు పూర్తయి చెరువులోకి వర్షపు నీరు చేరితో భూగర్భజలాలు పెంపొందే అవకాశం ఉంది.



నాగులచెరువు ఆధునికరణకు జరుగుతున్న పనులు

వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రులు

- బాలత్రిపురసుందరీదేవిగా దర్శనిమిచ్చిన అమ్మవారు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



దర్శి: బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



కనిగిరి: దొంతులమ్మ దేవాలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిం చేందుకు తీసుకెళుతున్న చీకటి వెంకటసుబ్బయ్య

దర్శి, అక్టోబరు 3: మండలంలో దేవిశరన్నవ రాత్రుల ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కనక దుర్గమ్మ గుడి, పోలేరమ్మ ఆలయం, వాసవీ కన్యకాపర మేశ్వరి ఆలయం, దద్దాలమ్మ గుడి, వెంకటేశ్వరస్వామి తదితర ఆల యాల్లో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చి భక్తుల పూజలందుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అమ్మ వారికి పొంగళ్ల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అలాగే, స్థానిక శ్రీఅన్నపూర్ణసమేతా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం శాంతి పౌష్టిక హోమం, రుద్రహోమం, అభిషేకం, మహపూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.



పామూరు: బాలత్రిపుర సుందరీదేవి అలంక రణలో వాసవీమాత



తాళ్లూరు: తూర్పుగంగవరంలో బాలత్రిపుర సుందరీ అలంకరణలో అమ్మవారు

కనిగిరిలో..

కనిగిరి, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కనిగిరి ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాల్లో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని సాయిబాబామందిరం, అంకాళమ్మదేవాలయం, దొరువులోని దుర్గాదేవీ ఆలయం, కొండదిగువన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, రామాలయం వీదిలోని వాసవీమాతాలయం, గార్లపేట రోడ్డులోని దొంతులమ్మ దేవాలయం, శ్రీవెంకటేశ్వరసామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దొంతులమ్మ దేవాలయంలో హనుమంతునిపాడు మండలానికి చెందిన చీకటి వెంకటసుబ్బయ్య అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వాసవీమాత ఆలయంలో దేవకి వెంకటేశ్వర్లు సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

పామూరులో..

పామూరు: దసరా నవరాత్రుల వేడుకల్లో భాగంగా అశ్వీయుజ శుద్ధపాడ్యమి పూజలు గురువారం స్థానిక వాసవీమాత ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయంలో గణపతి, కలశపూజ, హోమాలు నిర్వహించారు. ఈసందర్భం గా వాసవీ అమ్మవారికి క్షీరాభిషేకాలు, శ్రీదేవి లలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ కుబేరా అర్చనలు, హోమాలు నిర్వహించారు.

అనంతరం అమ్మవారు శ్రీబాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చా రు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వై.బాలకొండలరావు దంపతులు, కార్యదర్శి శేగు కృష్ణయ్య, కోశాధికారి దరిశి మస్తాన్‌రావు, ఉపాధ్యక్షులు కారంశెట్టి నారాయణ, వి.చంద్రశేఖర్, జి.గురునారాణ, కె.సురేష్‌బాబు, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, స్థానిక మదనవేణుగోపాలస్వామి భ్రీవల్లీభుజంగేశ్వరస్వామి దేవస్థానంలో దేవిశరన్న వరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలోని శ్రీకామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి క్షీరాభిషేకాలు నిర్వహించి వైవేద్యం స మర్పించారు. అనంతరం విజయదుర్గా భవాని అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి అలంకరణణ చేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

భైరవకోనలో..

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 3: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన దేవస్థానంలో గురువారం దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఈవో వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి గణపతిపూజ, త్రిముఖ దుర్గాంబదేవికి కుంకుమార్చన, రుద్రాభిషేకాలు, చండి హోమాలు నిర్వహించారు.

పూజా కార్యక్రమాల్లో ఎస్ఐ ఆర్.సుమన్, శ్యామ్ సుందర్‌రాజు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఈవో నర్రా నారాయణరెడ్డి, బి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలోని దేవాలయంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దేవి శరన్నవరాత్రుల వేడుకల్లో బాలత్రిపురసుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పంచామృత అభిషేకాలు, శ్రీసూక్తాలలిత అష్టోత్తర శత నామవాళి, కుంకుమ పూజలు నిర్వహించారు. మహానైవేద్యం సమర్పించి హారతులు ఇచ్చారు.

తాళ్లూరులో..

తాళ్లూరు: మండలంలో దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక కన్యకాపరమేశ్వరి, తూర్పుగంగవరం వాసవీ మాతా ఆలయాల్లో అమ్మవారిని బాల త్రిపురంసుందరీ రూపంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరస్వామి పూజ, సహస్రనామ కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తాళ్లూరు, తూర్పుగంగవరం ఆలయాల్లో దుర్గామాతకు మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.మండలంలోని పలు గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ముండ్లమూరులో గాలివాన బీభత్సం



రెడ్డినగర్ వద్ద రహదారికి అడ్డంగా పడిన చెట్లను తొలగింపజేస్తున్న ఎస్ఐ నాగరాజు

ముండ్లమూరు, అక్టోబరు 3: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. అరగంట పాటు ఉరుములు, మెరుపులతో పాటు గాలివాన అరగంట పాటు కురిసింది. మండలంలోని రెడ్డినగర్ వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ వైనాగరాజు సిబ్బంది తో వెళ్ళి ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్ల ను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ముండ్లమూరు, పసుపుగల్లు, ఉల్లగల్లు, వేముల, కెల్లంపల్లి, పులిపాడులతో పాటు ఈదర, భీమవరం, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, తమ్మలూ రు, నాయుడుపాలెం, సింగనపాలెం, శంకరాపురం, పోలవరం గ్రామాల్లో అరగంట పాటు వర్షం కురి సింది. ఈవర్షం పైర్లకు మేలు చేకూర్చింది. కాగా గు రువారం సాయంత్రం మండలంలోని పులిపాడు, లక్ష్మీనగర్ గ్రామాల్లో గాలివాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది కూలిన స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు ఏర్పాట్లుచేశారు.

వృత్తి విద్యాకోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

తాళ్లూరు, అక్టోబరు 3: వృత్తి విద్యాకోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని తూర్పుగంగవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ జాన్‌పీటర్ తెలిపారు. గురువారం తూర్పుగంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో జరిగే రోజువారీ కార్యక్రమాలపై అవగాహన కల్గించారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం పొందటానికి అవసరమైన నాలెడ్జ్, నైపుణ్యాలను వివరించారు. డాక్టర్ ఆల్‌ఫ్రెడ్ హె ల్త్ కేర్ ట్రేడ్‌కి సంబంధించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యరగొర్ల అంజిబాబు, చల్లగుండ్ల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 3: ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి ఏ సమాచారమైనా ప్రతి పౌరుడు పొందడమే సమాచారహక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని డిప్యూటి తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, ఉండేలా పౌరులకు సమాచారం అందించాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ ఖాదర్‌బీ, ఈవోపీఆర్డీ సీతారామయ్య, ఏవో కె.రాధ, ఏపీఎం లక్ష్మీనారాయణ, సర్పంచ్ శ్రీరాం పద్మావతి. ఉపసర్పంచ్ నరసయ్య, బొబ్బూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు, అక్టోబరు 3:నిమ్మ, బత్తాయి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే ప్రయోజనాలు ఉంటాయని ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని నాగంబొట్లపాలెంలో రైతులకు ఇచ్చిన ప్రత్యేక శిక్షణలో ఆయన మాట్లాడారు. బత్తాయిలో వేరుకుళ్లు నివారణ, ఎండుకొమ్మలు కత్తిరించే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి రవిబాబు మాట్లాడుతూ బత్తాయి తోటల్లో కాపు కోతల అనంతరం ఎండు పుల్లలను తొలగించు విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి.శ్రీను, ఐసీఆర్పీ వాణి తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, అక్టోబరు 3: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ అన్నారు. గురువారం మండలంలోని దారంవారిపాలెం, మన్నేపల్లి, తురకపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మొక్కజొన్న పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ పి.నరసింహం, వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 4 అక్టోబరు 2024





కందిపప్పు.. కొందరికే

- మంత్రి ప్రకటించినా అరకొరగా పంపిణీ
- ఒక్కో రేషన్ షాపునకు 100 కేజీలు మాత్రమే
- ఎలా సర్దుబాటు చేయాలో తెలియని స్థితిలో ఎండీయూలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో చక్కెర సరఫరా కూడా అంతంతే

పండుగ వచ్చింది.. పప్పన్నం చేసుకుందామని పేదలు అనుకున్నారు. ఈ నెల నుంచి కార్డుదారులకు ఇచ్చే రేషన్‌లో కందిపప్పు సహా గతంలో మాదిరిగా అన్ని సరుకులు ఉంటాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అయితే పేదలకు ఈ నెలలోనూ అది వీలయ్యేలా లేదు. మంత్రి ప్రకటించారు.. కందిపప్పు పంపిణీ చేశారు.. అయితే అది అందరికీ కాకుండా కొందరికే అందుతుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 17.30 లక్షలు కార్డులు ఉంటే కేవలం 81,243 కందిపప్పు ప్యాకెట్లను సరఫరా చేశారు. ఒక్కో రేషన్ దుకాణం పరిధిలో సుమారు 600 నుంచి 800 కార్డుదారులు ఉండగా వంద కేజీలు మాత్రమే కందిపప్పు సరఫరా అయింది. వీటిని కార్డుదారులకు ఏవిధంగా కేటాయించాలో అర్థంకాక ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన చెందుతున్నారు. ఇక చక్కెర పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 17.30 లక్షల కార్డులు ఉంటే 2.23 లక్షల ప్యాకెట్లు మాత్రమే సరఫరా అయ్యాయి. పండుగ నెలలో కూడా కందిపప్పు, చక్కెర ఇవ్వకపోవడంపై కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ప్రకటించారు కదా.. మాకెందుకు ఇవ్వరు అని మండిపడుతున్న కార్డుదారులకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక వారు అయోమయంలో ఉన్నారు.

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ కందిపప్పు రూ.150కి పైగా ఉంది. ఈ తరుణంలో రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు కేవలం రూ.67కే పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన కొద్దిమందికే లబ్ధి చేకూర్చనుంది. ఇందుకు కారణం అరకొరగానే కందిపప్పు నిల్వలను దుకాణాలకు పంపడమే. గుంటూరు నగరంలో ఒక్కో రేషన్ షాపులో 800లకు పైగా కార్డులుంటే కేవలం క్వింటాల్ కందిపప్పు మాత్రమే స్టాకు వచ్చినట్లు డీలర్లు తెలిపారు. దీంతో మిగతా వాళ్లకి ఏమి సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. చక్కెర ప్యాకెట్లు కూడా ఇవ్వలేదని, వీటిపై తాము కార్డుదారులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 1వ తేదీన నిత్యావసర సరుకుల పెరుగుదల నుంచి రేషన్ కార్డుదారులకు ఉపశమనం కలిగించేందుకు తెనాలి నుంచి కందిపప్పు, చక్కెర పంపిణీని ప్రారంభించారు. దసరా నవరాత్రులు గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో పండుగకి ఎంతో కొంత ఆర్థికభారం తగ్గుతుందని అంతా భావించారు. అయితే పౌరసరఫరాల సంస్థ రేషన్ దుకాణాలకు కనీసం 20 శాతం కందిపప్పు, పంచదార స్టాకు కూడా పంపలేదు. మరోవైపు మంగళవారం నుంచే ఈ నెల సరుకుల పంపిణీని ఎండీయూలు, రేషన్ డీలర్లు ప్రారంభించారు. తొలుత వచ్చిన కొద్దిమందికి కందిపప్పు పంపిణీ చేసేసి ఆ తర్వాత వచ్చిన వారికి స్టాకు అయిపోయిందని చెప్పి కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. దీంతో కార్డుదారులు తీవ్ర అసంతృప్తికి గురౌతున్నారు. రిటైల్ మార్కెట్‌లో కందిపప్పు కేజీ ధర రూ.150 నుంచి ప్రారంభమౌతున్నది. రేషన్ షాపుల ద్వారా రూ.67కి పంపిణీ చేస్తే దాదాపుగా రూ.83 వరకు ఆదా అవుతుంది. రేషన్ షాపుల ద్వారా చక్కెర ధరకి, బహిరంగ మార్కెట్‌లో ధరకి పెద్దగా వ్యత్యాసం ఉండదు. ఈ నేపథ్యంలో చక్కెర ఇవ్వకపోయినా ఫర్వాలేదు. కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. ఎండీయూ వాహనం ఒకసారి ఒక ప్రాంతానికి వస్తే మళ్లీ అటువైపు రాదు. ఈ దృష్ట్యా ఈ నెలకు తమకు కందిపప్పు రానట్లేనని చాలామంది కార్డుదారులు బాధపడుతున్నారు. గుంటూరు జిల్లాలో 5,99,511 రేషన్‌కార్డులుంటే చక్కెర 23,118 ప్యాకెట్లు, కందిపప్పు కేవలం 2,025 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డులుంటే చక్కెర 68,564, కందిపప్పు 1,168 ప్యాకెట్లు సరఫరా అయ్యాయి. పల్నాడు జిల్లాలో 6,45,110 కార్డులుంటే చక్కెర 1,31,381, కందిపప్పు 78,050 ప్యాకెట్లు పంపిణీ చేశారు. దీని వలనే పంపిణీలో సమస్యలు తలెత్తుతున్నాయి.



పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపిక
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు అవకాశం
- పేద విద్యార్థులు ఐఐటీ, నీట్ సీట్ల సాధన లక్ష్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 వేల మందికి లబ్ధి
- జాతీయ స్థాయి పరీక్షలకు సన్నద్ధమయ్యేలా కార్యాచరణ

గుంటూరు(విద్య), అక్టోబరు 3: ఐఐటీ, నీట్ విద్యాసంస్థల్లో చదువుకోవడం అందరి కల. కానీ వీటికి సంబంధించిన పోటీ పరీక్షలకు సిద్ధమవడం డబ్బుతో ముడిపడిన అంశం. కార్పొరేట్ కళాశాల విద్యార్థులకే ఇప్పటివరకు ఆయా జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందుతుంది. అయితే ఈ అవకాశాన్ని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు కూడా కల్పించాలని ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఈఏపీ సెట్‌తోపాటు, జాతీయ స్థాయిలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, గురుకుల జూనియర్ కళాశాలలు, కేజీబీవీల్లో దాదాపు 15వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రతిభ ఉన్నా సరైన శిక్షణ లేని కారణంగా పోటీపరీక్షల్లో వెనుకబడిపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సదరు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోంది.

పేదరికం కారణంగా శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, బడుగు బలహీనవర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలే. వారికి పదో తరగతి స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించి సరైన శిక్షణ తీసుకోలేక పోతున్నందున ఐఐటీ, నీట్ సీట్లు సాధించలేకపోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్ కోసం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

విద్యార్థుల ఎంపిక ఇలా..

నీట్, జేఈఈ శిక్షణకు సంబంధించి ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. దసరా సెలవుల తర్వాత విధివిధానాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

- వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం


బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీబాలత్రిపురసుందరిదేవిగా అమ్మవారు

బాపట్ల, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు జిల్లాలో గురువారం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని పూజలు చేశారు. బాపట్లలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని శ్రీప్రసన్న దుర్గాభవానీమాత ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా, పాతబస్టాండ్‌లో శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు మహాగౌరిదేవిగా, జీబీసీరోడ్డులోని బాపట్ల గ్రామ అధిష్టానదేవత శ్రీపోలేరమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమృతలూరు మండలం గోవాడలోని శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీబాలత్రిపుర సుందరిదేవిగా భక్తులు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రేపల్లెలో పలు ఆలయాల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరపూజ, కుంకుమపూజ, ప్రదోషకాల పూజ, తదితరపూజలు జరిగాయి.


బాపట్ల అధిష్టాన దేవత శ్రీపోలేరమ్మతల్లి దేవాలయంలో బాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో అమ్మవారు

నష్టపోయిన వారందరికీ పరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

- వ్యవసాయ, ఉద్యాన పంటలన్నింటికీ బీమా
- సమీక్షలో అధికారులతో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 3: వరద విపత్తులో నష్టపోయిన వారందరికీ పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పరిహారం పంపిణీపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల పరిహారం అందని అర్హుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గృహాలకు పరిహారం, వాహనాలకు బీమా వచ్చేలా చూడాలన్నారు. నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన పంటలకు బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలు రీషెడ్యూల్ చేయడానికి బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎమ్‌కు సూచించారు. ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల రూ.18 లక్షల పరిహారం అర్హులకి చేరలేదన్నారు. దెబ్బతిన్న13 వాహనాలు, గేదెల షెడ్లకు నగదు రాలేదన్నారు. వివిధ కారణాలతో 203మందికి పరిహారం నిలిచిపోవడంపై ఆరా తీశారు. తక్షణమే వారి ఇళ్లకెళ్లి సంబంధిత ధ్రువీకరణపత్రాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో పారదర్శకంగా మృతులను తొలిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా నవీకరణపై కసరత్తు ప్రారంభించామన్నారు. 1500 మంది ఓటర్లు దాటితే ఆ ప్రాంతంలో మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలనే నిబంధనల మేరకు ఆరు కేంద్రాలపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదన పంపుతున్నామన్నారు. మృతులను, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని జాబితా నుంచి తొలిగిస్తామన్నారు. జిల్లాలో 6,439 దరఖాస్తులు రాగా విచారణ వేగంగా చేస్తున్నామని 623 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల కొరకు ముసాయిదా ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, పర్చూరు ఈఆర్వో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్.. ఎక్సర్‌సైజ్

- పూర్తి స్థాయిలో సిబ్బంది కేటాయింపు
- జిల్లాలో ఈఎస్, ఏఈఎస్, స్టేషన్‌కో సీఐ
- గంజాయి, నాటుసారా కట్టడిపై దృష్టి పెట్టాలి

బాపట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిన వ్యవస్థల్లో అత్యంత కీలకమైనది ఆబ్కారీ శాఖ. కొంతమంది సిబ్బందిని ఎక్సైజ్ శాఖ నుంచి వేరు చేసి సెబ్‌ను ఏర్పాటు చేసింది. అయితే వైసీపీ పాలనలో సెబ్ ప్రభావవంతంగా పనిచేసిన దాఖలాలే లేవు. ప్రభుత్వమే నేరుగా మద్యం అమ్మకాలు చేపట్టడంతో ఎక్సైజ్ శాఖ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఈ దశలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఎక్సైజ్ శాఖకు పూర్వవైభవం కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. సెబ్‌ను రద్దు చేసి ఆ సిబ్బందిని తిరిగి మాతృశాఖ ఎక్సైజ్ విభాగంలో పోస్టింగ్‌లు ఇచ్చింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం మూలంగా మూలమూలకు విస్తరించిన గంజాయి, సారా తయారీపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి నియంత్రించాల్సిన బాధ్యత ప్రస్తుతం ఎక్సైజ్ శాఖపైనే ఉంది. ఇప్పటికే సెబ్ సిబ్బందిని పూర్తి స్థాయిలో ఎక్సైజ్ శాఖలో వివిధ హోదాల్లో నియమించింది. దీంతో దాదాపు పూర్తి స్థాయి యంత్రాంగంతో ఎక్సైజ్ స్టేషన్లు కళకళలాడుతున్నాయి. ఉన్న వనరులను పూర్తిగా ఉపయోగించుకుని గంజాయి నియంత్రణపై పూర్తి స్థాయి నిఘా పెట్టడంతో పాటు కఠిన చర్యలకు ఉపక్రమిస్తేనే ఎక్సైజ్ శాఖ గతవైభవం దిశగా అడుగులేస్తోంది. గతంలో మాదకద్రవ్యాల సరఫరాలో పట్టుబడిన వారి కదలికలపై నిఘా ఉంచి వారిని కటాకటాల వెనక్కి పంపిస్తే గంజాయి ఉచ్చునుంచి భవిష్యత్‌తరాలను రక్షించిన వారమవుతారు.

జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్లు...

జిల్లాలో బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి పరిధిలో ఏడు ఎక్సైజ్ స్టేషన్లు సేవలందించనున్నాయి. ఇప్పటికే ఆయా స్టేషన్లకు సిబ్బంది నియామకం ఓ కొలిక్కి వచ్చింది. బాపట్ల జిల్లా ఎక్సైజ్ విభాగం ప్రకాశం జిల్లా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పరిధిలోకి రానుంది. అదేవిధంగా జిల్లాలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పాటు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విధులు నిర్వహించనున్నారు. ప్రతి ఎక్సైజ్ స్టేషన్‌కు ఓ సీఐ నియామకాన్ని తాజా బదిలీల్లో ప్రభుత్వం చేపట్టింది. వీరితో పాటు సెబ్ నుంచి రిలీవ్ చేసిన సిబ్బందిని ఆయా స్టేషన్లకు ఎస్‌ఐలుగా, హెడ్‌కానిస్టేబుళ్లుగా, కానిస్టేబుళ్లుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

గతంలో ఒకరిపై ఒకరు నెపం..

ఎక్సైజ్ శాఖను విభజించి సెబ్‌ను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం విధి నిర్వహణలో వారి పాత్రపై స్పష్టమైన నిర్వచనం లేకుండా చేయడంతో ఒక శాఖపై మరో శాఖ నెపం వేసుకుని కాలం వెళ్లబుచ్చేవి. అక్రమ ఇసుక విషయంలో సెబ్ తూతూ మంత్రంగా తనిఖీలకు మాత్రమే పరిమితమయ్యేది తప్ప కేసుల నమోదు విషయంలో పోలీసు, రెవెన్యూ, సెబ్ ఇలా ఒకరిమీద ఒకరు వంక పెట్టుకోవడంతో చివరికి ఏ కేసు లేకుండానే అక్రమార్కులు దర్జాగా తప్పించుకునే వారు. అరొకర సిబ్బందితో సెబ్‌ను ఏర్పాటు చేసిందే పాలకుల అక్రమాలకు వంత పాడడానికేనన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నేతల ఒత్తిళ్లతో సెబ్ యంత్రాంగం కార్యాలయాలకే పరిమితమైంది తప్పితే క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టిన దాఖలాలు చాలా అరుదు. జిల్లాలో గంజాయి సరఫరా విస్తృతంగా వేళ్లానుకుంది. గత ప్రభుత్వంలో ఏకంగా వైసీపీ ఎంపీటీసీ ఇంటిలోనే పెద్దఎత్తున గంజాయి దొరికిన సంగతి తెలిసిందే. సూర్యలంక తీరంలో అయితే పలుమార్లు గంజాయి విక్రయిస్తూ వ్యక్తులు పట్టుబడిన ఘటనలు వెలుగు చూశాయి. విద్యాసంస్థలకు నెలవుగా ఉన్న బాపట్లలో విద్యార్థులే లక్ష్యంగా గంజాయి రాకెట్‌ను విస్తరించారు.

కట్టడి చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖదే..

ఐదేళ్లలో జిల్లాలో వ్యవస్థీకృతంగా మారిన గంజాయి నియంత్రణపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాల్సిన గురుతర బాధ్యత ఎక్సైజ్ శాఖపైనే ఉంది. సెబ్‌ను విలీనం చేయడంతో పాటు గతంలో లానే పేకాట, అక్రమ ఇసుక, కోడి పందేల కట్టడి వంటివి పోలీస్ శాఖ పరిధిలోకి వెళ్లాయి.

మిర్చియార్డు మాజీ చైర్మన్లకు విజిలెన్స్ పిలుపు

- వివిధ కారణాలు పేర్కొంటూ ముగ్గురు గైర్హాజరు
- లైసెన్సుల రెన్యువల్ అక్రమాలపై విచారణ వేగవంతం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డు చైర్మన్లగా బాధ్యతలు నిర్వహించిన ఆ పార్టీ నేతలకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. లైసెన్సుల రెన్యువల్, పార్టనర్షిప్‌ల డీడ్‌ల విషయంలో భారీ మొత్తంలో వ్యాపారుల వద్ద నగదు వసూలు చేసినట్లుగా ఫిర్యాదులు వచ్చాయని, వాటికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వరుసగా మూడు పర్యాయాలు చైర్మన్‌గా పని చేసిన ప్రస్తుత ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, రెండు నెలల పాటు చైర్మన్‌గా పని చేసిన మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చివరలో ఏడెనిమిది నెలలు బాధ్యతలు నిర్వహించిన నిమ్మకాయల రాజనారాయణకు విజిలెన్స్ అధికారులు ఫోన్లు చేసి ఆఫీసుకు రావాలని కోరారు. అయితే పార్టీ కార్యక్రమాలు ఉన్నందున తాము గురువారం రాలేకపోతున్నామని, త్వరలోనే వస్తామని చెప్పినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీరో, రేట్ కటింగ్ బిజినెస్‌ల రూపంలో రూ.కోట్ల నష్టం వాటిల్లినట్లు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లైసెన్సుల రెన్యువల్, పార్టనర్‌షిప్ డీడ్‌ల మార్పులు చేసి రూ.కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. అలానే షాపుల అద్దెలను తగ్గించి యార్డు ఆదాయానికి గండి కొట్టారని చెప్పారు. వీటిపై ఇప్పటికే అధికారులు, సిబ్బందిని విజిలెన్స్ అధికారులు విచారించారు. రికార్డులను తీసుకెళ్లారు. పలువురు వాంగ్మూలాలను నమోదు చేశారు. ఫైళ్లపై సంతకాలు చేసిన అప్పటి చైర్మన్ల స్టేట్‌మెంట్లు కీలకం కావడంతో వారిని రావాల్సిందిగా కోరారు. చంద్రగిరి ఏసురత్నం హయాంలో అరకొరగా లైసెన్సుల రెన్యువల్స్ జరిగాయి. ఎం సుధాకర్‌రెడ్డి పని చేసిన రెండు నెలల్లో వందల సంఖ్యలో లైసెన్సుల రెన్యువల్స్, పార్టనర్‌షిప్‌ల డీడ్‌ల మార్పులు చోటు చేసుకున్నాయి.

గుంటూరు మిర్చియార్డు


బావుడా వైస్ చైర్మన్‌గా ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా) వైస్ చైర్మన్‌గా జేసీ ప్రఖర్‌జైన్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు తప్పుకోవాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రస్తుతం బావుడా చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. ఎన్నికలకు ఏడాదిన్నర ముందు వైసీపీ ప్రభుత్వం హడావిడిగా బావుడాకు రూపకల్పన చేసింది. సరైన మార్గదర్శకాలు లేకుండా కేవలం నామినేటెడ్ పోస్టు కోసం దీనిని ఏర్పాటు చేశారన్న విమర్శను మూటగట్టుకుంది.

వేగంగా వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు

- నిర్మాణంలో ఇసుక వినియోగంపై విమర్శలు
- అక్రమంగా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు


216 జాతీయ రహదారి వద్ద ఫ్లైఓవర్ కోసం నిర్మిస్తున్న భారీ పిల్లర్లు


వాడరేవు రోడ్డులో నగరవనం వద్ద రోడ్డు విస్తరణ పనులు

చీరాల, అక్టోబరు 3 : వాడరేవు, పిడుగురాళ్ల 167ఏ జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో తీరప్రాంత రూపుమారనుంది. రూ.1062 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది డిసెంబరు లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. అంతవరకూ బాగానే ఉంది. ఆ నిర్మాణాలకు కావల్సిన ఇసుకకు సంబంధించి అనుమతి పొందిన రీచ్‌ల నుంచి కాకుండా స్థానికంగా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ప్రభుత్వ ఇసుక రీచ్‌లు లేవు. మైనింగ్, రెవెన్యూ నుంచి ప్రత్యేక అనమతులు పొందిన దాఖలాలు లేవు.

వాడరేవు, పిడుగురాళ్ల 167ఏ జాతీయ రహదారి పొడవు 81కి.మీ. అందులో జిల్లా పరిధిలో 35 కిలోమీటర్లు ఉంది. వాడరేవు సముద్రతీరం నుంచి పిడుగురాళ్ల వరకు జరిగే నిర్మాణంలో రెండు ఫ్లైవోవర్లు, ఒక ఆర్‌వోబీ నిర్మిస్తారు. ఆ క్రమంలో 216 జాతీయ రహదారిలో వాడరేవు క్రాస్ రోడ్స్ సమీపంలో ఓవర్ బ్రిడ్జి వస్తుంది. అందుకు సంబంధించి భారీ పిల్లర్ల నిర్మాణం జరుగుతోంది.

రోడ్డు మార్గంతో టూరిజం అభివృద్ధి

వాడరేవు, పిడుగురాళ్ల రోడ్డు విస్తరణతో టూరిజం పరంగా అభివృద్ధికి మెరుగైన వనరులు సమకూరుతాయి. ఆ క్రమంలో మెరైన్ ప్రాజెక్టులు వచ్చేందుకు మార్గం సుగమం అవుతుంది. ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుంది.

మత్స్యసంపద ఎగుమతులకు అనువైన వాతావరణం

మత్స్యకారులు తాము వేటాడి తెచ్చిన మత్స్య సంపదకు గిట్టుబాటు ధర పొందేందుకు అవకాశం ఏర్పడనుంది. సాధారణంగా వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు తాము వేటాడిన మత్స్య సంపదను ఎక్కువగా ఆయా ప్రాంతాల్లోని ఫిష్ ల్యాండ్ సెంటర్లలో నిర్వహించే వేలంలో వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. నూతనంగా రూపుదిద్దుకునే 167ఏ రోడ్డు ద్వారా తమ మత్స్యసంపదను మత్స్యకారులు త్వరితగతిన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వీలవుతుంది. దీంతో వ్యాపారులు ఎక్కువ మంది కొనుగోలుకు వస్తారు. తద్వారా పోటీ పెరిగి మత్స్యకారులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

నాణ్యతలో రాజీపడకుండా నిర్మాణ పనులు

వాడరేవు, పిడుగురాళ్ల రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా పక్కా ప్రణాళికతో పనులు జరుగుతున్నాయి. అనుమతులు పొందిన రీచ్‌ల నుంచే ఇసుక వినియోగం చేస్తున్నారు. ఈ రహదారి పూర్తయితే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

- వెంకటేశ్వరరావు, డీఈ, ఎన్‌హెచ్

ఇసుక వినియోగంపై విమర్శలు

నూతన రోడ్డు నిర్మాణ పనులు వచ్చే ఏడాది డిసెంబరు ఆఖరులోపు పూర్తి చేయాలనే లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు చెప్తున్నారు. నిర్మాణానికి సంబంధించిన ఇసుకను ప్రభుత్వ అనుమతులు పొందిన రీచ్‌ల నుంచి మాత్రమే కాంట్రాక్టర్ కొనుగోలు చేసి వినియోగించాలి. పని జరిగే ప్రాంతానికి సమీపంలో అందుబాటులో ఉన్నచోట అక్రమార్కుల నుంచి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అందుకు సంబంధించి అక్రమార్కులు రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తవ్వి, రవాణా సాగిస్తున్నట్లు సమాచారం. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో ఇసుక తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఎవరికి అనుమతులు లేకపోవడం గమనార్హం.



మేదరమెట్లలో మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో

ఆధునిక పద్ధతులతో పంటలు లాభసాటి

అద్దంకిటౌన్, అక్టోబరు 3 : రైతులు ఆధునిక పద్ధతులను పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఏడీఏ కె.ధనరాజ్ అన్నారు. గురువారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో సాగుచేస్తున్న వరి పంటను పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ వరిలో చీడపీడలు ఎక్కువగా ఉన్నాయని అనవసరంగా పురుగుమందులు పిచికారీ చేయవద్దన్నారు. ప్రభుత్వం డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందు పిచికారీని ప్రోత్సహిస్తుందని, దీని వలన సమయం, పురుగు మందు ఆదా అవుతుందన్నారు. తద్వారా మనుషుల మీద ప్రభావం చూపకుండా ఉండడంతో ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. పంట నమోదు పూర్తి అయిందని, ఈకేవైసీ కూడా వందశాతం పూర్తి చేసి అనంతరం గ్రామసభ నిర్వహించి జాబితాను సామాజిక తనిఖీలో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.అనిల్, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు మహమ్మద్ రఫీ, దివ్వకోలు రాధా కృష్ణమూర్తి, అన్నాబత్తిన సుబ్బయ్య, బైరపునేని సత్యనారాయణ పాల్గొన్నారు.

మేదరమెట్ల : అపరాల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని పిగుడిపాడు, కొరిశపాడు గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (సీఎల్‌సీ) క్రాప్‌లైన్ సిస్టమ్ యాప్ గురించి రైతులకు వివరించారు. పంటలను ఆశించిన పురుగులు, తెగుళ్లను ఫొటోలు తీసు అప్‌లోడ్ చేయడం వలన పరిష్కార మార్గాలను వెంటనే అమలు చేస్తారన్నారు. పశువైద్యాధికారి వెంకట్రావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, పశుపోషణ, విత్తన సబ్సిడీ టీకాలను వివరించారు. రైతు బంధుపథకం, గోడౌన్‌లలో పంటలు నిల్వ చేసుకునే విషయాలను ఏఎంసీ సిబ్బంది రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో కొరిశపాడు సర్పంచ్ విజయకుమార్, వీహెచ్ఏ బీటీ జాన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీలో గురువారం పొలంపిలుస్తోంది కార్యమాన్ని నిర్వహించారు. వరి పంటలో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. కోస్టల్ సెక్యూరిటీలో భాగంగా లైఫ్ జాకెట్లు, జాయిలు, జీపీఎస్ హ్యాండ్‌సెట్స్ 75 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు గ్రామ మత్స్యశాఖ సహాయకుడు ఎన్.వుల్లారావు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.కవిత, ఎమ్.జస్వంత్, మార్కెటింగ్‌శాఖ ప్రతినిధి బాజీవలి, సాగరమిత్రలు, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పంగులూరు : ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం పొందవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం, అలవలపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నజీరూన్, జాగర్లమూడి శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు ఫిలిప్, దిల్షా, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : పొలంపిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయ, అనుబంధం శాఖల అధికారుల సేవలను రైతులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి కోరారు. మండలంలోని కుందుర్రు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో మాధురి, గ్రామ వ్యవసాయ సహాయకులు శివాజీ, రైతులు కొప్పోలు కొండలు, యడ్లపల్లి మురళి, గట్ట శ్రీను పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, అక్టోబరు 3 : ఇంకొల్లులో గురువారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన తోటకూర సుశీల(88) మృతి చెందారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల డాక్టర్లు ఆమె నేత్రాలను సేకరించారు. నేత్రదానంకు సహకరించిన కుటుంబసభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు రఫీ, సాంబశివరావు అభినందించారు.

కార్లు ఉన్నా..పార్కింగ్ స్థలం లేదు

చీరాల, అక్టోబరు 3 : కరోనా కాలం నుంచి కార్ల వినియోగం పెరిగింది. గతంలో సైకిళ్ల మాదిరిగా ఇప్పుడు మోటారు బైక్‌లు ఉన్నాయి. కొవిడ్ నేపథ్యంలో దాదాపు అన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం చేశారు. ఆ క్రమంలో కార్లు ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ వాహనాలతో స్వగ్రామాలకు వచ్చారు. తరువాత సింహభాగం కంపెనీలు ఉద్యోగులు మరలా కంపెనీలకు రావాలని పిలుపు ఇవ్వగా తిరుగుముఖంపట్టారు. కొన్ని కంపెనీలకు సంబంధించిన ఉద్యోగులు నేటికీ వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నారు. ఇదిలావుంటే కరోనా తరువాత మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వారిలో కార్ల కొనుగోలు గణనీయంగా పెరిగింది. అయితే వాటి పార్కింగ్ చేసేందుకు ఇంటి వద్ద స్థలం ఉన్నవారు తక్కువ. పార్కింగ్ స్థలం లేనివారు వారి ఇళ్లకు సమీపంలో ఉన్న ఖాళీ స్థలాల్లో పార్క్ చేస్తున్నారు. కొత్తపేటలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అలాంటి చోట అప్పటి వరకు కార్లు పెట్టుకున్న వారు పార్కింగ్‌కు ప్రత్నామ్న్యాయ వనరుల కోసం ప్రయత్నిస్తున్నారు.


కొత్తపేట పార్కు ముందు నిలిపిన కార్లు

ఆడ, మగను సమానంగా చూడాలి

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

చీరాల, అక్టోబరు 3 : అన్ని విషయాలలో ఆడ, మగ అనే భేదం లేకుండా సమానంగా చూడాలని ఆర్డీవో సూర్యనారయణరెడ్డి చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన గురువారం పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్‌పై సమీక్షా సమావేశం జరిగింది. సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేటివ్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆడపిల్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కాన్ సెంటర్లు, భ్రూణ హత్యలకు పాల్పడుతున్న వైద్యులను గు ర్తించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీస ర్ డీఐవో డాక్టర్ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, డాక్టర్ యాకోబు, గైనకాలజిస్ట్ డాక్టర్ షణ్ముఖశ్రీ, పలువురు ఎన్జీవోలు పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న మహేంద్రనాథ్

రథం నిర్మాణానికి రూ.25వేల విరాళం

చీరాల, అక్టోబరు 3 : పేరాల గంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి నూతన రథం నిర్మాణానికి సాయమందించారు. టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ గురువారం రథం నిర్మాణ కమిటీ ప్రతినిధులకు రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మహేంద్రనాథ్ తన తల్లిదండ్రులు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాలకొండమ్మ పేర్ల మీద విరాళం అందజేశారన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు తడవర్తి చంద్రశేఖరరావు, అన్నదాత పాండు, కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకోవడంలోనే సంతృప్తి

పర్చూరు, అక్టోబరు 3: వృద్ధులను ఆదుకోవడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నేతాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు కోటా దంపతులు పండ్లు, రొట్టెలు, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వహికులు కోటా దంపతులను సన్మానించారు.


బతకమ్మ అమ్మవార్ల పీఠాలతో మహిళా భక్తులు

బతుకమ్మ అమ్మవారి పీఠాల స్థాపన

వేటపాలెం(చీరాల), అక్టోబరు 3 : మండల పరిధిలోని అణుమల్లిపేట మహాలక్ష్మి చెట్టు వద్ద భక్తులు గురువారం బతుకమ్మ అమ్మవార్ల పీఠాల స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవార్ల పీఠాలతో నగరోత్సవం నిర్వహించారు. స్థాపన అనంతరం భక్తి గీతాలను ఆలపించారు.

కనులపండువగా అమ్మవారికి పూజలు

పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, మహేంద్రనాథ్

చీరాల, అక్టోబరు 3 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాలు, ప్రత్యేక పందిళ్లలో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, టీడీపీ నియోజకర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు. తోటవారిపాలెం వీవర్స్ కాలనీ రెండో లైన్లో వేంచేసిఉన్న నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఏర్పాటు చేసిన బాలాత్రిపురసుందరి అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఇంకొల్లు మండల సర్వసభ్య సమావేశం

- అలస్యంగా అధికారులు రాక
- ఫోరం లేక మధ్యాహ్నానికి వాయిదా

ఇంకొల్లు, అక్టోబరు 3 : మండల సర్వసభ్య సమావేశం ఫోరం లేక గురువారం రెండు మూడు గంటల వాయిదా వేశారు. మరోవైపు అధికారులు సైతం తమకెందుకులే అన్నట్లు సమావేశం పూర్తయ్యేవరకూ వస్తూనే ఉన్నారు. ఎంపీపీ బండారు అనూష, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, అరకొరగా హాజరైన అధికారులు, ఐదారుగురు ప్రజాప్రతినిధులతో సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ అనూష స్టాలిన్‌పేటలో నాడు-నేడు కింద అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సభ దృష్టికి తెచ్చారు. విద్యుత్ ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ కొనికిలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, ఇంకొల్లులో లోవోల్టేజీ సమస్యకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


బాలాత్రిపురసుందరి అలంకరణలో వాసవీమాత


ప్రత్యేక అలంకరణలో భావనారాయణస్వామి

అద్దంకి, అక్టోబరు 3 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఛైర్మన్ వూటుకూరు రామకోటేశ్వరరావు, ఉమా అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం గుండికా (గుండ్లకమ్మ)నది నుంచి 102 మంది మహిళలు కలశములతో జలం తీసుకు వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. గోపూజ నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. విభూతి ఉమాశంకర్ బృందం బుర్రకథ కాలక్షేపం ఆకట్టుకుంది. అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. పట్టణంలోని వేయి స్తంభాల గుడి, దత్తపాదుకా క్షేత్రం, శింగరకొండలోని గాయత్రీ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

బాలాత్రిపురసుందరి అలంకరణలో

మేదరమెట్ల : దసరా నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం తొలిరోజున అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. మేదరమెట్లలోని శ్రీ కనక దుర్గ ఆలయంలో దైవాలరావూరులోని శ్రీ ఉమామహేశ్వరి ఆలయంలో, రావినూతలలోని శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా పూజలు అందుకున్నారు. ఉదయం నుంచే దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక కుంకుమ పూజలను భక్తితో నిర్వహించారు.

ఘనంగా ప్రారంభం

చినగంజాం : మండల పరిధిలోని పలు దేవాలయాలలో విజయదశమి పండుగను పురస్కరించుకుని దేవీ శరన్నరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని కన్యకాపరమేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మందిరంలోని బతుకమ్మ అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామంలోని శ్రీలలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని అమ్మవారిని శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. మండల పరిధిలోని పలు దేవాలయాలలోని అమ్మవార్లను పలు రకాల అలంకారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోని శ్రీవారిని, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రికి అంకురారోపణ పూజలు జరిపారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


నారు పీకి కట్టలు కడుతున్న కూలీలు

ముమ్మరంగా వరినాట్లు

చీరాల, అక్టోబరు 3 : కొమ్మమూరు ఆయకట్టు పరిధిలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆ క్రమంలో కొందరు బయట నుంచి తెచ్చి నారును విక్రయిస్తున్నారు. మరి కొందరు సొంత చేలల్లో నారుమడి పెట్టుకుని ఏతకు వచ్చిన నారును అదే చేలో నాట్లు వేసుకుంటున్నారు.

ఎంపీడీవోగా స్వరూపారాణి బాధ్యతలు



పంగులూరు, అక్టోబరు 3 : మండల అభివృద్ధి అధికారిగా కె.స్వరూపారాణి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె చినగంజాం ఎంపీడీవోగా పని చేస్తూ మండలానికి బదిలీపై వచ్చారు. అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా స్వరూపారాణికి పలువురు నేతలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌గా సింగారావు



పంగులూరు, అక్టోబరు 3 : జె.పంగులూరు తహసీల్దార్‌గా పోపూరి సింగారావు గురువారం బాధ్యతలను చేపట్టారు. తాళ్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న సింగారావు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరిస్తానన్నారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సింగారావుకు పలు గ్రామాల టీడీపీ నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చినగంజాం ఎంపీడీవోగా శ్రీనివాసమూర్తి


ఎంపీడీవోకు శుభాకాంక్షలు చెప్తున్న ఉద్యోగులు

చినగంజాం, అక్టోబరు 3 : మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎ.శ్రీనివాసమూర్తి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసమూర్తి కొనకనమిట్ల మండలంలో పనిచేస్తూ బదిలీపై చినగంజాం మండలానికి వచ్చారు. ఇక్క డ పనిచేస్తున్న ఎంపీడీవో కే.స్వరూపరాణి బదిలీల్లో భాగంగా పంగులూరు మండలానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తిని పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, మండల పరిషత్ కార్యాలయ ఏవో కే.సుదర్శన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నక్కల వేణు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంకొల్లు ఎంపీడీవోగా శ్రీనివాసరావు

ఇంకొల్లు, అక్టోబరు 3 : మండల అభివృద్ధి అధికారిగా జి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలను చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి కొరిశపాడు మండలానికి బదిలీ కాగా, నెల్లూరు జిల్లాలో పని చేస్తున్న శ్రీనివాసరావు ఇంకొల్లుకు బదిలీపై వచ్చారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం


బదిలీ అయిన అధికారులను సత్కరిస్తున్న సిబ్బంది

పంగులూరు, అక్టోబరు 3 : దీర్ఘ కాలంగా మండలంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న అధికారులను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మా నించారు. 2016 నుంచి పంగులూరు మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్‌గా, ఎంపీడీవోగా రామాంజనేయులు సేవలందించగా, 2015 నుంచి పీఆర్ ఏఈగా రామ్‌కుమార్ పనిచేసి ప్రజామన్ననలు పొందారు. కొండపి ఎంపీడీవోగా రామాంజనేయులు, ఒంగోలుకు పీఆర్ ఏఈగా రామ్‌కుమార్ బదిలీ అయ్యారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు టి.రమేష్, వేణుగోపాల్, కార్యదర్శి సునీత, ఇంజనీరింగ్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల వెబ్‌సైట్‌కు అంతరాయం

అద్దంకి, అక్టోబరు 3 : ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వెబ్‌సైట్ ఆధునీకరణలో భాగంగా ఈ నెల 5, 6 తేదీలలో పనిచేయదని డీఎం రామ్మోహనరావు తెలిపారు. 7వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్‌లు కౌంటర్ల వద్ద తీసుకోవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 3 : రోడ్డు ప్రమాదం ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరుపాలెంలోని పద్మనాభునిపేటకు చెందిన ఆత్మకూరి సీతారామాంజనేయులు విశ్రాంత ఉపాధ్యాయుడు. గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, చీరాల నుంచి బాపట్ల వైపు వెళ్లే ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితుడిని స్థానికులు చీరాల వైద్యశాలకు తరలించి చికిత్సను అందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం అక్రమ రవాణాపై కేసు

చీరాలటౌన్, అక్టోబరు 3 : మద్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చీరాలకు చెందిన గోపీ నల్లగాంధీ బొమ్మ సెంటర్‌లోని రోడ్డులో మద్యం తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి, 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు.

మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలు

అద్దంకి, అక్టోబరు 3 : మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో మోటార్‌సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పంగులూరు మండలం బూదవాడకు చెందిన చెంచుబాబు గురువారం వర్షం పడే సమయంలో శింగరకొండ వైపు నుంచి అద్దంకి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చెంచుబాబును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

బైకు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

బల్లికురవ, అక్టోబరు 3 : ఎదురుగా సైకిల్‌పై వస్తున్న చిన్నారిని తప్పించబోయి బైకు అదుపు తప్పిన ఘటనలో ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు గాయపడ్డారు. అద్దంకి వైపు నుంచి కార్యాలయానికి ఏవో పాండురంగస్వామి, టైపిస్టు ఉమమహేశ్వరరావు బైకుపై వస్తుండగా వల్లాపల్లి వద్ద రోడ్డుకు అడ్డుగా చిన్నారి సైకిల్‌పై రావడంతో తప్పించే ప్రయత్నంలో వారు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సహచర ఉద్యోగులు వారిని గుంటుపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్సను అందించి, అనంతరం అద్దంకి వైద్యశాలకు తరలించారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

బల్లికురవ, అక్టోబరు 3 : మొక్కజొన్న సాగు చేసే రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి కుమారి కోరారు. గురువారం మండలంలోని నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏఈవో వంశి, వ్యవసాయ సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు.


అద్దంకి మార్కెట్ యార్డ్ ఆవరణలో రవికుమార్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌లో ఉన్న ఫైర్ ఇంజన్

ఎట్టకేలకు అగ్నిమాపక కేంద్రానికి స్థలం

● దశాబ్దకాలం తరువాత కేటాయింపు
● మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రవికుమార్ దృష్టి

అద్దంకి, అక్టోబరు 3 : ఎన్నో దశాబ్దల నుంచి ఎదురు చూస్తున్న అద్దంకిలోని అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దశాబ్ద కాలం కిందట జరిగింది. అయితే అప్పటి నుంచి స్థల కేటాయింపు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. తొలుత మేదరమెట్ల రోడ్డులో స్థలం కేటాయింపు జరిగినా అనువుగా లేకపోవడంతో విరమించుకున్నారు. అనంతరం పలు చోట్ల పరిశీలన చేసినా ఏదో ఒక విధంగా అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అగ్నిమాపక కేంద్రానికి స్థల కేటాయింపు దశాబ్దకాలం ఆలస్యం అయింది. 2013 డిసెంబరులో అద్దంకిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్‌యార్డు ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అగ్నిమాపక వాహనం ఉంచేందుకు వసతి లేకపోవడంతో గొట్టిపాటి రవికుమార్ 2014లో తన సొంత నిధులు సుమారు రూ.లక్ష కేటాయించి రేకుల షెడ్‌ను ఏర్పాటు చేయంచారు. మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఓ గదిని ఫైర్‌స్టేషన్ అధికారి, సిబ్బంది, కార్యాలయానికి కేటాయించారు. దీంతో సిబ్బంది విశ్రాంతి తీసుకోవాలన్నా ఆరుబయటే ఉండాల్సిన పరిస్థితి. ఇలా దశాబ్దకాలం పైనే గడిచిపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం, గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బందిలో ఆశలు చిగురించాయి. ఇటీవల గొట్టిపాటి అద్దంకి వచ్చిన సమయంలో అగ్నిమాపక కేంద్రం స్థల సమస్య ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే స్థల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శింగరకొండ రోడ్డులో 23 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. అవసరమైన మేర నిధులు కేటాయించి అన్ని వసతులతో అగ్నిమాపక కేంద్ర నిర్మాణంపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అద్దంకిలో ఫైర్ ఆఫీస్‌కు సొంత భవనం కల నెరవేరే అవకాశం ఉంది. నామ్‌రోడ్డు వెంబడే స్థలం కేటాయింపు జరగడంతో మరింత సౌకర్యంగా ఉంటుందని సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కును అందజేస్తున్న స్కూల్ ప్రతినిధులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,00,116 విరాళం

● ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కును అందజేసిన శ్రీ ప్రియదర్శిని విద్యోదయ స్కూల్

చీరాల, అక్టోబరు 3 : సీఎం రిలీఫ్ ఫండ్‌కు శ్రీ ప్రియదర్శిని విద్యోదయ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి రూ.1,00,116 చెక్కును గురువారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచి సేవా దృక్పథాన్ని అలవర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్వోల బదిలీలు

అద్దంకి, అక్టోబరు 3 : మండలంలోని పలు గ్రామాల వీఆర్వోలు బదిలీలు కాగా, కొత్త వారిని నియమించారు. మణికేశ్వరం వీఆర్‌వో యలమందరావు కొరిశపాడుకు బదిలీ కాగా, అద్దంకి టౌన్-2 నుంచి దారవి నియమితులయ్యారు. అద్దంకి టౌన్-4 నంచి దామా సురేంద్ర బదిలీ కాగా, ధర్మవరం నుంచి ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ధర్మవరానికి వెంకటాపురం నుంచి విజయకుమార్‌ను నియమించారు. జార్లపాలెం నుంచి శివయ్య మేదరమెట్ల-3 కి బదిలీ కాగా, కొరిశపాడు నుంచి సీహెచ్.శ్రీనివాసరావును నియమించారు. శంఖవరప్పాడు నుంచి సుధాకర్ తిమ్మనపాలెంకు, చినకొత్తపల్లి నుంచి సుబ్బారెడ్డిని తమ్మవరానికి బదిలీ చేశారు. చక్రాయపాలెం నుంచి జ్యోతిరావు ను నియమించారు. ఉప్పలపాడు నుంచి రాజు రావినూతలకు బదిలీ అయ్యారు. వెంపరాల నుంచి ఎం.సుబ్బారావు ముప్పవరం బదిలీ కాగా, అద్దంకి టౌన్ 9 నుంచి ప్రసన్నను నియమించారు. అద్దంకి టౌన్ 6 నుంచి యాకోబు నుంచి ఎస్ఎల్ గుడిపాడుకు బదిలీ చేశారు. మోదేపల్లి నుంచి డేవిడ్ రాజును వెంకటాపురానికి బదిలీ చేశారు. అద్దంకి టౌన్-3 నుంచి ప్రసూనను మోదేపల్లికి నియమించారు. ధేనువకొండ నుంచి లక్ష్మయ్యను కలవకూరుకు, బుల్లిబాబును ఏదుబాడు నుంచి ధేనువకొండకు నియమించారు. కలవకూరు నుంచి శ్రీలక్ష్మిని తిమ్మాయపాలెంకు, తిమ్మాయపాలెం నుంచి స్వాతిని చక్రాయపాలెం నియమించారు. అద్దంకి టౌన్-1 నుంచి షేక్ బాషాను అద్దంకిటౌన్-9కు బదిలీ చేశారు. మక్కెనవారిపాలెం నుంచి రజనీని అద్దంకిటౌన్-2కి నియమించారు.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కమ్యూనిటీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్

కారంచేడు వాసులకు తీరనున్న నీటి కష్టాలు

● రూ.75 లక్షల ఓఎన్‌జీసీ నిధులతో కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్
● నేడు ప్రారంభోత్సవానికి హాజరు కానున్న ప్రముఖులు

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 3 : కారంచేడు గ్రామ వాసులకు నీటి కష్టాలు తీరనున్నాయి. కలుషిత నీటి ఇక్కట్లు తీర్చేందుకు రూ.75లక్షల ఓఎన్‌జీసీ (సీఎస్ఆర్) నిధులతో కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను గ్రామంలోని లైబ్రరీ చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజుకు లక్ష లీటర్ల నీటిని శుద్ధి చేసి కారంచేడులోని కొన్ని వార్డులకు నేరుగా పంచాయతీ కొళాయి ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. దీంతోపాటు గ్రామంలోని ప్రతి వార్డుకు నీటిని సరఫరా చేయాలన్న సంకల్పంతో జయప్రకాష్ చెరువు ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో 1.50లక్షల సామర్థంతో ఆక్వాటికా ప్రొవిజన్ ఫుడ్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్మాణం తలపెట్టిన ప్లాంట్‌కు శుక్రవారం భూమి పూజ చేయనున్నారు.

కారంచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ కె.వెంకటమురళి హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మెప్మాలో మళ్లీ రుణ గోల్‌మాల్..!



గతంలో రూ.40 కోట్లు మాయం
ఆ కుంభకోణంపై విచారణ, చర్యలు నామమాత్రం
తాజాగా రూ.2కోట్ల రుణదోపిడీ..!
బోగస్ గ్రూపులు ఏర్పాటు
నాడు అవినీతిపై గోల చేసిన వారే నేడు వత్తాసు
పూర్తి సహకారం అందిస్తున్న సిబ్బంది

మెప్మాలో మళ్లీ రుణగోల్‌మాల్ చోటుచేసుకుంది. గతంలో రుణాల పేరుతో కోట్లు దోచుకున్న మాదిరిగానే ఇప్పుడు బోగస్ గ్రూపులు పెట్టి కోట్లు కొల్లగొట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కనీస చర్యలు లేకపోవడం, పైగా ఆ సిబ్బందినే ప్రస్తుతం కూడా విధుల్లో కొనసాగిస్తుండటం గమనార్హం. ఇదే అవకాశంగా తాజాగా మరి కొంతమంది నకిలీ గ్రూపులను సృష్టించారు. చిరువ్యాపారం పేరుతో బ్యాంకులకు టోకరా వేసి రూ.2కోట్ల మేర దోచుకున్నట్లు సమాచారం. మెప్మా కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు వారికి అండగా నిలుస్తూ వారికి అవసరమైన సహకారం అందించినట్లు తెలుస్తోంది. గతంలో జరిగిన రుణ స్కాంతోపాటు, తాజాగా వెలుగులోకి వచ్చిన నకిలీ రుణాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 2 : పేదల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అవినీతికి నిలయంగా మారింది. అర్హులైన వారికి రుణాలు ఇవ్వడంలో మొండి చేయి చూపుతున్న యంత్రాంగం, బోగస్ గ్రూపులకు భరోసా కల్పిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ పొదుపు గ్రూపులతో సుమారు రూ.40కోట్లు వరకు రుణాలు తీసుకుని బ్యాంకులకు బురిడీ కొట్టించిన విషయం తెలిసిందే. ఈ స్కాంలో ఉన్న ఆర్పీలు, మెప్మా సిబ్బందిపై ఫిబ్రవరి 4వ తేదీ నుంచి ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన ఆ శాఖ అధికారులు తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు భారీగానే చేశారు. అయితే అప్పట్లో మేయర్‌గా ఉన్న గంగాడ సుజాత అంత పెద్దమొత్తంలో అవినీతి జరగలేదని, రూ.12కోట్లు మాత్రమే స్కాం జరిగిందంటూ మీడియా సమక్షంలో వెల్లడించారు. ఇదిలాఉంచితే కథనాలపై స్పందించిన అప్పటి కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ ముగ్గురు అధికారులతో విచారణకు ఆదేశించారు. అయితే విచారణలో తేలిన వాస్తవాలు ఏమిటో, ఎంత మేర గోల్‌మాల్ జరిగింది, ఎవరు బాధ్యులో ఇంతవరకు తేల్చకపోవడంతో మెప్మాలో నిధుల గోల్‌మాల్ మరుగునపడిపోయింది.

నాడు ఆరోపణలు చేసినవారు... నేడు మౌనం

మెప్మాలో అవినీతి నిగ్గుతేల్చాలి? కోట్ల రూపాయలు దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు తర్వాత కిమ్మనకుండా మౌనంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాడు దొంగ దొంగ అన్నవారే నేడు వారితో చేతులు కలిపి, విచారణ అంశాలపై నోరు మెదపకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు మరో రుణ మాయకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మరో పది బోగస్ గ్రూపులు ఏర్పాటు కావడం, అందుకు మెప్మా కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు సహకారం అందించడం విశేషం. వారికి తోడుగా మేమున్నామంటూ టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పేర్లు మార్చి నకిలీ గ్రూపులు

కొన్ని నకిలీ గ్రూపులను చూపి ఓ గుర్తింపు కలిగిన బ్యాంకులో రుణాలు పొందినట్లు సమాచారం. పేర్లు మార్చి నకిలీ గ్రూపులను ఆర్పీలు తయారుచేస్తున్న తీరును అందరూ ఆశ్చర్యపోతున్నారు. వాస్తవానికి ఒక గ్రూపులో పదిమంది సభ్యులు ఉంటారు. ఆదేవిధంగా ఒక్కో ఆర్పీ కింద కొన్ని గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూపు నుంచి ఇద్దరు మహిళ సభ్యులు పేర్లు తీసి, వారి ఆధార్ కార్డులు మార్చేసి, గ్రూపు పేరును కూడా పూర్తిగా మార్చకుండా ముందు ఏదో ఒక పదాన్ని చేర్చి మరో కొత్త గ్రూపును తయారుచేస్తారు. అయితే ఎప్పటి నుంచో బ్యాంకర్లతో రుణాలకు సంబంధించి పరిచయాలు కలిగిన ఆర్పీలు కొత్త గ్రూపులుగా వారికి చూపుతారు. ఆ వెంటనే వారికి లక్షల్లో రుణాలు మంజూరుచేయిస్తారు. అయితే ఇదంతా గ్రూపు సభ్యులకు తెలియదు. ఇలా వందల సంఖ్యలో గ్రూపులను తయారుచేసి ఒంగోలు నగరంలోనే రూ.2కోట్ల మేర స్వాహా చేసినట్లు సమాచారం.

వాస్తవాలు వెలికితీస్తే మరిన్ని బోగస్ రుణాలు

అయితే మెప్మాలోని కొందరు ఆర్పీలు ఈ రుణ మోసంలో సూత్రధారులుగా వ్యవహరించినట్లు సమాచారం. కాగా ఈ వ్యవహారం అమాయక పొదుపు మహిళలు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అయితే పొదుపు మహిళల పేరుతో నకిలీ గ్రూపులు సృష్టించి కోట్లు రూపాయల నిధులు కాజేసిన వైనంపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేకపోలేదు. అంతే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి బోగస్ రుణాలకు కళ్లెం వేసినట్లు అవుతుందని, అలాగే వారిపై చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని పలువురు పొదుపు మహిళలు కోరుతున్నారు.

బోగస్ గ్రూపులపై విచారించి చర్యలు తీసుకుంటాం

● టి.రవికుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్



బోగస్ గ్రూపులు సృష్టించి, రుణాలు పొందడంపై విచారణ చేస్తాము. అందుకు బాధ్యులైన వారిని గుర్తించి తగుచర్యలు తీసుకుంటాము. అయితే క్షేత్రస్థాయిలో పొదుపు గ్రూపులు నేరుగా బ్యాంకుల ద్వారానే రుణాలు పొందుతాయి. దీంతో ఈ విషయం మెప్మా అధికారులకు తెలిసే అవకాశం ఉండదు. ఈ అంశాన్ని బ్యాంకు అధికారులతో జరిగే సమావేశాల్లో పలుమార్లు హెచ్చరించాం. బ్యాంకులు మంజూరు చేసే రుణాలు నేరుగా గ్రూప్ సభ్యుల వ్యక్తిగత ఖాతాలోకి జమ అవుతాయి. ఇవి మెప్మా నిధులు కాదు. గతంలో బోగస్ గ్రూపులను ప్రోత్సహించిన ఇద్దరు సీఎల్ఆర్పీలు, ఐదుగురు ఆర్పీలను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాము. ఇలాంటి వ్యవహారాలను అరికట్టేందుకు మెప్మా ఎండీ ఎస్‌హెచ్‌జీల డేటా ప్యూరిఫికేషన్‌కు ప్రత్యేక యాప్ త్వరలో ప్రారంభిస్తున్నారు. ఈ యాప్ ద్వారా ఒక సభ్యురాలు ఒక గ్రూపులోనే నమోదవుతుంది.

విజన్-47 లక్ష్యంగా ముందుకు

క్యూఆర్ కోడ్‌తో అభిప్రాయ సేకరణ, 11 అంశాలపై సర్వే ముమ్మరం
క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో కొనసాగుతున్న ప్రక్రియ
జిల్లాలో ఇప్పటికే 70వేల మంది భాగస్వామ్యం
జిల్లా, మండల ప్రణాళికలను సిద్ధం చేస్తున్న యంత్రాంగం


క్యూఆర్ కోడ్ ఆధారంగా దీజీపేటలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఒంగోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర 2047 పేరుతో ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. మొబైల్ ఫోన్‌లో క్యూఆర్ కోడ్ ఆధారంగా 11 అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రధానంగా సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ ఉన్న వారి నుంచి ఈ అభిప్రాయాలను సేకరిస్తున్నారు. గత వారంరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ సాగుతుండగా జిల్లాలో ఇప్పటికే సుమారు 70వేల మందిని సర్వే చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తవుతుంది. అప్పటికి ప్రపంచంలో మూడవ అగ్రగామి శక్తిగా భారత్ నిలవాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం వికసిత భారత్ 2047 పేరుతో సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. తదనుగణ ప్రణాళికలు, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పథకాలు, వాటి కార్యచరణ వైపు దృష్టి సారించింది. ఇదేసమయలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణ లక్ష్యంతో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి దేశంలో ఏపీ ఒక పెద్ద వృద్ధి చెందిన రాష్ట్రంగా తయారవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఆర్థిక, సామాజిక, వాతావరణ సుస్థిరతలపై దృష్టిసారించి స్వర్ణాంధ్ర 2047 పేరుతో దార్శనిక పత్రం(విజన్) రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రణాళికను రాష్ట్ర స్థాయిలో రూపొందించారు. వచ్చే నవంబరు 1న దానిని ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ లోపుగా ప్రభుత్వం రూపొందించే ప్రణాళికలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న ఆలోచనకు వచ్చిన ప్రభుత్వం అందుకు చర్యలు చేపట్టింది. కరపత్రాలు, పోస్టర్లు, సభలు, సమావేశాలు ఇతరత్రా రూపాలలో యంత్రాంగం ద్వారా ప్రజలకు ఈ ప్రణాళికపై ఇప్పటికే అవగాహన కల్పించిన ప్రభుత్వం తాజాగా ప్రణాళికలో కొన్ని కీలక అంశాలపై ప్రజల అభిప్రాయాలను కూడా నిర్దిష్టంగా తీసుకోవాలని భావించింది. స్వర్ణాంధ్ర 2047పై ప్రజల ఆలోచనలు, సలహాలు సేకరణ కోసం క్యూఆర్ కోడ్‌ను ప్రత్యేకంగా రూపొందించి దాని ద్వారా సేకరిస్తున్నారు స్మార్ట్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ప్రశ్నల రూపంలో మొత్తం 18 అంశాలు వరుసగా వస్తాయి. ప్రధానంగా ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యాటకం, వాతావరణ సమతుల్యత, పునరుత్పాదక ఇంధనం తదితర అంశాలు అందులో ఉన్నాయి. మండల పరిషత్ అధికారులు, మునిసిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది ద్వారా అభిప్రాయాల సేకరణ చేస్తున్నారు.

ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక

జిల్లాలో ఐదు రోజులుగా ఈ క్యాంపెయిన్ కొనసాగుతుండగా ఇప్పటివరకు 70వేల మంది అభిప్రాయాలు తెలియజేసినట్లు సమాచారం. మరో 30వేల మందిని 5వతేదీలోగా సర్వే చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలాఉండగా 2047 అనేది సుదీర్ఘ సమయం కావడంతో జిల్లా, మండలస్థాయిలో ప్రగతి కోసం 2024 -29 మధ్య ఐదేళ్ల కార్యచరణ ప్రణాళిక రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణ ప్రణాళిక రూపకల్పనలో ప్రస్తుతం జిల్లా యంత్రాంగం ఉన్నారు. ప్రధానంగా సహజ వనరులు, వాటి సద్వినియోగం, విద్య, ఉపాధి అవకాశాలు పెంపు, అందుకు వ్యవసాయ. పారిశ్రామిక, సేవారంగాలలో తీసుకోవాల్సిన చర్యలను ఈ ప్రణాళికల్లో పొందుపరుస్తున్నారు.

డ్రైనేజీ నిర్మించాకే హైవే రోడ్డు పనులు


రైతుల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ ప్రకర్ జైన్

పంట పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు
అధికారులను ఆదేశించిన జేసీ జైన్
నష్టం లేకుండా చూడాలని రైతుల విజ్ఞప్తి

పర్చూరు, అక్టోబరు 3 : డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన తరువాతే నేషనల్ హైవే రోడ్డును ఏర్పాటు చేయాలని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రకర్ జైన్ అన్నారు. జేసీ, ఆర్డీవో పి.గోరియా, ఆర్‌అండ్‌బీ, డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి కారంచేడు, పర్చూరు ప్రాంతాల్లోని రోడ్డు నిర్మాణ పనులను, వ్యవసాయ భూములను గురువారం పరిశీలించారు. వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా పర్చూరు నుంచి కారంచేడు మీదుగా చేపడుతున్న హైవే నిర్మాణంలో డ్రైనేజీని ఏర్పాటు చేయకుండా రోడ్డు పనులు చేపడుతున్నారు. సమీప డ్రైనేజీ కాలువలను సైతం పూడ్చేసి రోడ్డు నిర్మాణం చేస్తుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కొద్దిపాటి వరదలు, భారీ వర్షాలు సంభవిస్తే పొలాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. గతవారం రైతులు హైవే పనులను అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణంతో తమ పంట పొలాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు జేసీ వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన జైన్ పూర్తిస్థాయిలో డ్రైనేజీని నిర్మించాకే రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని సూచించారు.

భారీ వర్షంతో పంటలకు జీవం

బల్లికురవ, అక్టోబరు 3 : ఎండ వేడిమితో విలవిల్లాడుతున్న పంటలకు గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం జీవం పోసింది. ఉక్క పోతతో నాలుగు రోజులుగా పెరిగిన ఎండలతో పంటలు ఎండు ముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. పొగాకు మొక్కలు ఎండి పోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. భారీ వర్షం పడడంతో రైతులు పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బల్లికురవ, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు గ్రామాలలో వర్షం బాగా పడిందని రైతులు తెలిపారు.

ప్రశాంతంగా టెట్

ఒంగోలు(విద్య), అక్టోబరు 3 : జిల్లాలో గురువారం ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష మొదటిరోజు ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో సజావుగా సాగింది. అభ్యర్థులను గంటన్నర ముందుగా ఉదయం సెషన్‌కు ఉదయం 8 గంటల నుంచి, మధ్యాహ్నం సెషన్‌కు ఒంటిగంట నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలుచేయడంతోపాటు ఆ కేంద్రాల పరిధిలో ఉన్న జెరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూయించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష మొదటిరోజు రెండు సెషన్లలో 117 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 525 మందికి 461 మంది పరీక్షకు హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 386 మందికి 333 మంది హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో ఈ పరీక్షలు జరిగాయి.


నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

1,116 కలశాలతో అమ్మవారి భక్తుల నగరోత్సవం

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కరణం వెంకటేష్

చీరాల, అక్టోబరు 3 : సంతబజారులో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం దేవీ నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక పూజలను ప్రారంభించారు. అందులో భాగంగా 1,116 మంది మహిళా భక్తులు పసుపు నీళ్ల కలశాలతో నగరోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి గుంటూరు మాధవరావు, విజయలక్ష్మి దంపతులు అమ్మవారి చిత్రపటంతో నగరోత్సవం అగ్రభాగాన నిలిచారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని వెంకటేష్ అమ్మవారికి మొక్కుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇబ్బందిగా ఉన్న చెట్ల కొమ్మలు మాత్రమే తొలగింపు


అద్దంకి, అక్టోబరు 3 : అద్దంకి మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న గోదాములు, షెడ్లకు ఇబ్బందిగా ఉన్న చెట్ల కొమ్మలు, కాండములు, చిల్లచెట్లు, ఎండిపోయిన చెట్లను తొలగిస్తున్నట్లు ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఫణిరావు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చెట్ల తొలగింపు, కొమ్మలు నరికివేత అనే కథనంపై స్పందించిన ఫణిరావు ప్రకటన విడుదల చేశారు. గత నెల 30వ తేదీన విజయవాడ ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు అద్దంకి మార్కెట్ యార్డును పరిశీలించిన సమయంలో గోదాములు, షెడ్‌లు దెబ్బతినే అవకాశం ఉందని గుర్తించి తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో తొలగిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారుల నుంచి అనుమతి విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

విద్యుత్ విజిలెన్సు అధికారుల తనిఖీ

ఇంకొల్లు, అక్టోబరు 3 : ఇంకొల్లు మండలంలో గురువారం విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. గ్రామాలలో అనధికారకంగా విద్యుత్‌ను వాడుతున్న పలు సర్వీసులను ఏడీఈ వెంకటేశ్వర్లు తమ బృందంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట విజిలెన్స్ ఏఈ కోటేశ్వరరావు, పద్మావతి, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, కాల్వలకు నిధులు మంజూరు

మార్టూరు, అక్టోబరు 3 : మార్టూరు గ్రామ పంచాయతీలో సీసీరోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు కోటి న్నర రూపాయలు మంజూరైనట్లు పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు అన్నారు. గురువారం మార్టూరులో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ జరిగింది. ఈ సభకు సర్పంచ్ భూక్యా సుమితాబాయి అధ్యక్షత వహించారు. గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను, భవిష్యత్‌లో చపట్టే పనులను కార్యదర్శి శ్రీనివాసరావు వివరించారు. అండరుపాస్ వద్ద సులాభ్ కాంప్లెక్స్‌ను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమ్మ శివనాగేశ్వరరావు, షేక్ రజాక్, కాకోలు వెంకటేశ్వర్లు, కన్నెగంటి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇసుక సరఫరా : కలెక్టర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఇసుకను సరఫరా చేసేందుకు అన్నీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకొన్న వెంటనే ఇసుకను సరఫరా చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఎలాంటి టెక్నికల్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. త్వరలోనే ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో జేసీ కార్తీక్,కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ,మైనింగ్ డీడీ చంద్రశేఖర్, ఈఈ నాగరాజు,ఆర్డీవోలు చందన, మాలోల పాల్గొన్నారు.

కొలువుదీరిన అమ్మణ్ణులు



రాపూరు : పెంచలకోనలో సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి



నెల్లూరు : భవానీగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



నెల్లూరు : చండీ అలంకారంలో రాజరాజేశ్వరి



నెల్లూరు : రాజరాజేశ్వరిగా ఇరుకళల పరమేశ్వరి



ఆత్మకూరు : స్వర్ణకవచాలంకృత జ్వాలాముఖిగా దర్శనమిచ్చిన అమ్మవారు



వరికుంటపాడు : శైలపుత్రి అలంకరణలో మానసాదేవి



నెల్లూరు : రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తజనం,



అమ్మవారి సన్నిధిలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

లోకరక్షిణీ మాం పాహి!



సంగంలో పెన్నా జలాలను తీసుకొస్తూ..



నెల్లూరులో 1008 కలిశాల ఊరేగింపు

- వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం
- ఆలయాల్లో అమ్మవారి అవతార దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా అంతటా గురువారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. జగన్మాత నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. తొలిరోజు కలిశ స్థాపన, చండీ హోమాలు, విశేష పుష్పాలంకరణలతో అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో కలిశ స్థాపన, సంపుటీకరణ చండీ హోమం, లలితా సహస్ర నామ కుంకుమార్చన జరిగాయి. అమ్మవారు చండీ అలంకారంలో దర్శనం ఇచ్చారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో కలిసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అళహరి విజయకుమార్, ఈవో సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలోని జొన్నవాడ కామాక్షితాయి, కావలి కలుగోళమ్మ, అల్లూరు పోలేరమ్మ, పెంచల కోన ఆదిలక్ష్మి, వేదగిరి లక్ష్మీదేవి, సంగం కామాక్షిదేవీ ఆలయాల్లో కలిశ స్థాపనలు వైభవంగా జరిగాయి. అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనం ఇచ్చారు.

● వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉద యం కలిశ స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ జరిగాయి. భక్తులు 1008 కలిశాలతో పెన్నా ఘాట్ నుంచి నదీ జలాలు సేకరించారు. అమ్మవారి వెండి రథం ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం అమ్మవారు భవానీ అలంకారంలో దర్శనం ఇచ్చారు.

నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నేతలు



దేవదాయ శాఖను రద్దు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం) : తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, హిందూ ఆలయాల్లో ఉద్యోగులుగా ఉన్న అన్యమతస్థులను తొలగించాలని పలు హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. నగరంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ, మద్రాసు బస్టాండ్, ఆచారివీధి మీదుగా కలెక్టరేట్ వరకు గురువారం వారు ర్యాలీని నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక నాయకులు ఏవీఆర్ మోహన్‌రావు, కాకు మురళీరెడ్డి మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో దేవదాయ శాఖను రద్దు చేసి, హిందూ ఆలయాల నిర్వహణను ధార్మిక సంస్థలకు అప్పచెప్పాలన్నారు. అప్పుడే సనాతన ధర్మం కాపాడబడుతుందన్నారు. లౌకికవాదం పేరుతో హిందూ ధర్మంపై దాడి చేయడం దారుణమని, హిందువులు మెజారిటీగా ఉన్న దేశంలో హిందూ ఆలయాలకు, సంస్కృతికి రక్షణ లేకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో టీడీపీ నాయకులు సత్యనాగేశ్వరరావు, జనసేన నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు శశికుమార్, రాజేంద్ర, నాగశ్రీనివాస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో
స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ : కలెక్టర్



పర్కుషాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ప్రజాప్రతినిధులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 3 : ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో జిల్లాలో స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ఆనంద్ చెప్పారు. గురువారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్లాన్ తయారీపై ప్రజల నుంచి సలహాలు తీసుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులతో వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విజన్ ప్లాన్ కోసం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలంతా క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి సూచనలు ఇవ్వాలని, ఇప్పటివరకు 50 వేల మంది వివరాలు పొందుపరచారని చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ విజన్ ప్రణాళిక ద్వారా 2047 నాటికి ఉదయగిరి నియోజకవర్గ రూపురేఖల్లో మార్పు తీసుకువస్తామ న్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో, జిల్లా వ్యవసాయశాఖాధికారిణి సత్యవాణి, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, భారత్ సేవా పౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసిం, రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి, లతీఫ్‌కుట్టి, సుబ్రహ్మణ్యం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దసరాలో
'ప్రైవేటు' దోపిడీ

● భారీగా టికెట్ల ధర పెంపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : దసరా పండుగ కోసం జిల్లాకు తరలివచ్చే ప్రజలకు ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు చుక్కలు చూపుతున్నారు. పండుగకు ఇతర ప్రాంతాల నుంచి ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ప్రజలు జిల్లాకు తరలిరానున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు బస్సుల యాజమాన్యం టికెట్ల ధరలను భారీగా పెంచేసింది. పెంచిన ధరలను ఆన్‌లైన్‌లో ఉంచడంతో వాటిని చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రిజర్వు చేసుకుంటున్నారు. అయితే, ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నా సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి నెల్లూరుకు టికెట్ల ధరలు ఇలా (రూ.లలో)

ప్రాంతం	బస్సు	సాధారణం	పెరిగినది
హైదరాబాద్	నాన్ ఏసీ	850	1490
హైదరాబాద్	ఏసీ స్లీపర్	1600	2600
బెంగుళూరు	నాన్ ఏసీ స్లీపర్	900	1400
బెంగుళూరు	ఏసీ స్లీపర్	1000	1900
విశాఖపట్నం	ఏసీ స్లీపర్	1500	2500

నెల్లూరులో రెడ్‌క్రాస్ ప్రతినిధుల నుంచి ఉత్తమ మోటివేటర్ అవార్డు అందుకుంటున్న కావలి ఆర్టీసీ అధికారులు



శభాష్..

రక్తదానంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన కావలి ఆర్టీసీ డిపోకు ఉత్తమ మోటివేటర్ అవార్డు లభించింది. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంలో భాగంగా గురువారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నుంచి డిపో అసిస్టెంట్ మేనేజరు కేవీఆర్ బాబుకు అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో ఆర్టీసీ భద్రతా పక్షోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కావలి డిపో సిబ్బంది అత్యధిక సంఖ్యలో రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలవడమేగాక ప్రథమ స్థానం సాధించారని అన్నారు. కావలి డిపో తరపున అవార్డు స్వీకరించిన కేవీఆర్ బాబుకు డిపో మేనేజరు రాహూరు శ్రీనివాసులు, రామకృష్ణ, రమేష్‌బాబు, రవిప్రకాష్, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

\- కావలి

పచ్చని చెట్టుపై పిడుగు



పిడుగుపడితే ఎలా ఉంటుందో ఈ చిత్రమే నిదర్శనం. లింగసముద్రం మండలం పెదపవని గ్రామంలో శుక్రవారం రాత్రి ఉరు ములు, మెరుపు లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో మాసాని మాలకొండయ్య అనే రైతుకు చెందిన తోటలో ఓ చెట్టుపై పెద్ద శబ్దంతో పడిగుపడింది. అంతే, చెట్టు ఇదిగో ఇలా రెండుగా చీలిపోయింది. పిడుగుపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

\- లింగసముద్రం

ప్రశాంతంగా టెట్



నెల్లూరులోని ఆయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3: డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తొలిరోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఏపీ టెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 9,350 మంది పరీక్షలకు హాజరవుతుండగా, వీరికి నెల్లూరులో రెండు, కావలిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, నెల్లూరులోని నారాయణ కాలేజీలో తొలిరోజున పరీక్షలు జరగలేదు. తొలిరోజు గురువారం ఉదయం జరిగిన పరీక్షకు 725 మంది హాజరు కావాల్సి ఉండగా, 644 మంది హాజరవగా, 81 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 725 మందికిగాను 650 మంది హాజరయ్యారు. 75 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద తొలిరోజున 1450 మందిగాను 1294 మంది హాజరవగా 156 మంది గైర్హాజరయ్యారు. టెట్‌కు సంబంధించి అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలోని ఫోన్ 94411 48062, 78932 58325, 63053 64463 నెంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలను జిల్లా అబ్జర్వర్, రాష్ట్ర ఓపెన్‌స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, డీఈవో రామారావు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

సోమశిలలో 52.81 టీఎంసీల నిల్వ

అనంత సాగరం : సోమశిల జలాశయానికి 7,311 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా.. 52.815 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1500, కండలేరుకు 10,000, ఉత్తర 540, దక్షిణ కాలువలకు 5 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పదేళ్లయినా పాకులాటే!

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రగతి అంతంతే!?
- పూర్తిస్థాయిలో మంజూరుకాని పీజీ సీట్లు
- అందని ద్రాక్షలా సూపర్‌స్పెషాలిటీ వైద్యం
- ప్రధాన విభాగాలకు డాక్టర్ల కరువు
- పాలకులు స్పందిస్తేనే ప్రగతి సాధ్యం



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 3 : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభు త్వ వైద్య కళాశాల జిల్లాకే తలమానికం. 2013లో పురుడు పోసుకున్న ఈ కళాశాలలో ఇప్పటికి ఎంబీబీఎస్‌ను రెండు బ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. నగర నడిబొడ్డున సువిశాల స్థలంలో ఏర్పాటైన ఈ కళాశాలలో సంస్కరణ లు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. 2013లో అప్పటి రాష్ట్ర రెవె న్యూ శాఖ మంత్రి, ప్రస్తుతం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయ ణరెడ్డి కృషి ఫలితంగానే వైద్య కళాశాల ఏర్పడింది. అప్పట్లో రూ.400 కోట్లు వెచ్చించి కళాశాలను నిర్మించారు. మొదట్లో 150 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా 2017లో ఆ సీట్ల సంఖ్య 175లకు చేరుకుంది. అయితే పీజీ సీట్లు రాబట్టుకు నే విషయంలో అడగడుగునా ఆటంకాలు తప్పడం లేదు. 2022-23 విద్యా సంవత్సరంలో 21 విభాగాలలో 130 పీజీ సీట్లు అవసరమని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు (ఎన్‌ఎంసీ) ప్రతిపాదనలు పంపించారు. ఇందుకోసం ఒక్కో విభాగానికి రూ.2.36 లక్షల వంతున 21 విభాగాలకు రూ.49.56 లక్షలు కూడా చెల్లించారు. కనీసం వంద సీట్లు అయినా వస్తాయని ఆశిం చిన అధికారులకు నిరాశే మిగిలింది. కేవలం 23 పీజీ సీట్లకు మాత్రమే ఎన్‌ఎంసీ నుంచి అనుమతి లభించింది. దీంతో అందే సంవత్సరం 68 పీజీ సీట్ల మంజూరు కోరుతూ రూ.89 లక్షలు చెల్లిం చారు. ఆ తర్వాత కూడా 24 పీజీ సీట్లనే కేటాయించింది. ఈ ఉత్తర్వులు తాజాగా ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరాయి. ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆశించిన స్థాయిలో పీజీ సీట్లు కేటాయించి ఉంటే వైద్య విద్యార్థులకు ఉపయు క్తంగా ఉండేదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

నేడు, రేపు వార్షికోత్సవం

ప్రభుత్వ వైద్య కళాశాల వార్షి కోత్సవం శుక్ర, శనివారాల్లో జరగనుంది. ఈ రెండు రోజులు సాయంత్రం పూట విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. నృత్య ప్రదర్శనలతోపాటు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల వేషధారణలతో అలరించనున్నారు. అలాగే ఇటీవల జరిగిన క్రీడలలో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

● అందని సూపర్‌స్పెషాలిటీ వైద్యం

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి పదేళ్లు పూర్తయినా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు మాత్రం అందనంటున్నాయి. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలు మినహా మిగిలిన 11 వైద్య కళాశాలల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జీజీహెచ్‌లో 750 పడకలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 230 మంది వైద్య నిపుణులు ఉన్నారు. అయినా సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందుబాటులో లేవు. కనీసం ఎమ్మారై, సిటీస్కాన్‌లు తీసేందుకు ఒకేఒక్క రేడియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారు. ఇక్కడ ఐదుగురు రేడియాలజిస్టుల అవసరం ఉంది. అలాగే, గుండె సంబంధిత విభాగానికి వైద్య బృందం కరువయ్యింది. న్యూరాలజీ విభాగంలో గతంలో ఇద్దరు న్యూరాలజీ ఫిజీషియన్లు ఉండగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆయన కూడా మంగళ, శుక్రవారాలు మాత్రమే ఓపీలో ఉంటారు. ప్రతి రోజూ ఓపీకి వస్తున్న వ్యాధిగ్రస్థులకు తిప్పలు తప్పడం లేదు. కిడ్నీ సంబంధిత వైద్యుల నియామకమే జరగలేదు. యూరాలజీ విభాగానికి ఒక వైద్యుడే దిక్కు అయ్యారు.

అమాత్యులు స్పందిస్తేనే

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు, పీజీ సీట్ల పెంపు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం ఉండటం లేదు. ఈ విషయాలను జీజీహెచ్, వైద్యకళాశాల అధికారులు జిల్లా మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లి తద్వారా ముఖ్యమంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఎన్‌ఎంసీ ద్వారా అనుమతులు తెప్పించాల్సి ఉంది.

● అంతా గోప్యం

మరోవైపు ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమమైనా ప్రజల్లోకి వెళితేనే సార్థకత చేకూరుతుంది. అయితే, ఇక్కడ మాత్రం అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఏ కార్యక్రమమైనా మీడియాకు సమాచారం ఇవ్వడం లేదు. పట్టుబట్టి అడిగితే మొక్కుబడి సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

పీజీ సీట్ల కోసం కృషి చేస్తున్నాం



ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆశించిన స్థాయిలో పీజీ సీట్లు సాధించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొన్ని సమస్యలు ఉన్నాయి. శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి ఉంటుంది. అలాగే కొన్ని వైద్య పరికరాలు అవసరమవుతాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని ఎన్‌ఎంసీ పీజీ సీట్లు మంజూరు చేస్తుంది. ఇందుకోసం జిల్లాలోని మంత్రులను, ఇతర ప్రజాప్రతినిధులను కలవనున్నాము.

\- డాక్టర్ గోవింద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ప్రియంవద

కందుకూరు, అక్టోబరు 3: పట్టణంలోని వివిధ ప్రవేటు హాస్పిటల్స్‌లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లను గురువారం జిల్లా ఉప వైద్యాధికారి ప్రియంవద ఆకస్మికంగా తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పరీక్షలు చేసినవారికి, అడిగిన వారికి కూడా చట్టపరమైన శిక్షలు విధించబడతాయని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి నెల స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి ప్రతినెల 2వ తేదిన జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయానికి నివేదికలను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ అధికారి షేక్ ఆరిఫుల్లా పాల్గొన్నారు.

నూకసాని ప్రమాణ స్వీకారానికి తరలిరండి

లింగసముద్రం, అక్టోబరు 3: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మాజీ జడ్పీ చైర్మన్, ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ప్రమాణ స్వీకానికి విజయవాడకు తరలి రావాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బోడి సురేష్, నేతలు చిట్టిబోయిన సుధాకర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం ఆటోనగర్ ఏపీ టీడీపీ కార్యాలయంలో కార్యక్రమం జరు గనుంద న్నారు.

రెండు ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ స్వాధీనం

కావలి, అక్టోబరు 3: సర్వాయపాలెం పంచాయతీ అల్లిగుంటపాలెంకు చెందిన రెండు మట్టి ట్రాక్టర్లు, ఎక్సకవేటర్‌ను గురువారం మధ్యాహ్నం పోలీసులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల వద్ద పశువులు కట్టేసేందుకు తువ్వమట్టి మేరవ తరలిస్తున్నట్లు తమకు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. మామూళ్లు ఇచ్చిన వారిని వదిలేసి మిగతా వారిని కొందరు పట్టుకుంటుండగా మరి కొందరు రాజకీయంగా ఫిర్యాదులు చేసిన వారివి పట్టుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కలిగిరి, అక్టోబరు 3: స్థానిక ఓరియన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఉదయగిరి నియోజకవర్గ శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులు అరుణ, జే.వీ.రమేష్‌లతో పాటు పలువురు విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో నేతలు ఊసా మాల్యాద్రి, మంజాన్‌రావు, నిశ్శంకర సురేష్, కె.దిలీప్‌కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

తీరప్రాంత రోడ్లను పునర్నిర్మించాలని నిరసన

కావలి, అక్టోబరు 3: కృష్ణపట్నం పోర్టు నుంచి విశాఖ వరకు జరుగుతున్న గ్యాస్ పైపులైన్ల నిర్మాణంలో భాగంగా ధ్వంసమైన రోడ్లను పునర్నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. గురువారం వారు కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట తీరప్రాంత ప్రజలతో కలసి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంచిపాక రత్నం, చెరుకూరు జనార్ధన్, జ్యోతి జాన్, పీ శ్రీనివాసులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉరుములతో కూడిన మోస్తరు వర్షం

బిట్రగుంట, అక్టోబరు 3: బోగోలు మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. వారంరోజులుగా వేసవిని తలపించే ఎండ వేడిమికి తల్లడిల్లి పోతున్న ప్రజలకు కాస్త ఉపసమనం దొరకింది. వర్షపు జల్లులతో వాతావరణం చల్లపడింది.

పోరంబోకు భూముల ఆక్రమణ

మర్రిపాడు, అక్టోబరు 3: ప్రభుత్వ భూములతో పాటు పోరంబోకు భూములు సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. కదిరినేనిపల్లి రెవెన్యూలో గత వారం రోజులుగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. సర్వే నెంబర్ 67లో సమూరు 20ఎకరాల మేతపోరంబోకు భూమిని ఆక్రమించి జామాయిల్ మొక్కలు నాటారు. దానితోపాటు సర్వే నెంబరు 1లో 803 ఎకరాలు మేతపోరం బోకు భూమి ఉండగా అందులో ప్రస్తుతం 25ఎకరాలు జామాయిల్ మొక్కలు నాటేందుకు గత రెండు రోజులుగా కంపచెట్లను తొలగించి చదును చేశారు.

భగ్గుమంటున్న నిత్యావసరాలు

- ధరలన్నీ ఆకాశంలోనే..
- చింతపండు కిలో రూ.200
- వంటనూనె లీటరుకు రూ.21 వరకు పెరుగుదల
- సామాన్యులపై ఆర్థిక భారం



ఆత్మకూరు, అక్టోబరు 3 : నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. ముఖ్యంగా నూనె, ఉల్లిపాయలు, చింతపండు, కందిపప్పు, పెసరపప్పు ధరలు మండిపోతున్నాయి. ఇక పప్పు, సాంబరు, రసం వంటి వాటిలో తప్పనిసరిగా వినియోగించే చింతపండు ధర డబుల్‌సెంచరీకి చేరింది. ప్రస్తుతం చింతపండు కిలో రూ.200ల వరకు ఉంది. కిలో కందిపప్పు కేజీ 175, పెసరపప్పు రూ.130, మినపప్పు కూ. రూ. 125 నుంచి రూ. 185 వరకు విక్రయిస్తున్నారు. మరోపక్క వంట నూనె ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్‌ఆయిల్ లీటరు ధర రూ131లకు చేరింది. లీటరు ప్యాకెట్‌పై ఒకేసారి ఏకంగా రూ. 21 వరకు ధర పెరిగింది. ఇలా పలు రకాల నిత్యావసరాలపై ధరల మోత మోగుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. ఇక చిల్లరదుకాణాల్లో అయితే ఉల్లి ధరలు మరింత మండిపోతున్నాయి. ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు, కర్నూల్, గొల్లప్రోలు ఉల్లిపాయలకు ఇది అన్‌సీజన్ కావడంతో వాటి దిగుమతులు తగ్గి మార్కెట్‌లో అయా ప్రాంతాల ఉల్లి కనిపించే పరిస్థితి లేదు. దాంతో ఉల్లి ధర మరింత పెరిగి కంటతడి పెట్టించనున్నాయి.

● కాగుతున్న వంటనూనెలు



వంట నూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఫ్రీడమ్, న్యాచురల్, గోల్డ్‌డ్రాఫ్, సన్‌ఫ్లవర్ వంటి అన్ని రకాల అయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. లీటరుకు రూ. 21 వరకు ధర పెరగడంతో సాధారణ, మధ్యతరగతిప్రజలకు భారంగా మారింది. క్యారెట్, క్యాప్సికమ్, టమోటా వంటి కూరగాయల ధరలు చుక్కలంటుతున్నాయి.. కిలో టమోటా రూ.40 నుంచి రూ.50ల వరకు దిగిరావడం లేదు. నిత్యవసరాల ధరలు భగ్గుమనడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

● బ్లాక్‌మార్కెట్ బూచి

ఉల్లిపాయలు, చింతపండు, నూనె వంటి కొన్ని సరుకుల ధరలు అనూహ్యంగా పెరగడానికి బ్లాక్‌మార్కెట్ శక్తులే కారణమనే ఆరోపణలు చిరువ్యాపారుల నుంచి వస్తున్నాయి. ఈ విషయపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏ దిక్కూలేని వాళ్లం... పింఛన్ ఇప్పించండి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకార మహిళలు

బిట్రగుంట, అక్టోబరు 3: సదువు కోలేదు. భర్తలేడు దినసరి కూలీ ఉంటే సరే.. లేకుంటే పస్తులుంటూ ఒంటరి జీవితం సాగిస్తున్నాం నాకు పింఛన్ ఇచ్చి ఆదుకోండి సారూ అంటూ తీరప్రాంత మత్స్యకార మహిళలు గురువారం ఎంపీడీవో వెంకటసుబ్బారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వీరి వెంట బోగోలు మండలం సీఆర్‌పాలెం పంచాయతీ తాటిచెట్లపాలెం సామాజిక కర్త ప్రళయ కావేరి భాగ్యలక్ష్మి ఉన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వీరికి న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీడీఓ చెప్పారు.

మీ సేవ, ఈసేవ సర్వీసుదారులకు న్యాయం చేయండి

నెల్లూరురూరల్, అక్టోబరు 3: వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా అణచి వేతకు గురైన మీసేవ, ఈసేవ సర్వీ సుదారులకు న్యాయం చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయనకు వారు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ నేత అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకునే అవకాశం మీసేవ, ఈసేవ సర్వీసుదారులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 2014-19 టీడీపీ హయాంలో తామే ఇవన్నీ చేసుకుని జీవనం గడుపుతున్నా మన్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి యంత్రాలు, షాపులు, సిబ్బందిని ఏర్పాటు చేసు కున్నామని తెలిపారు. జగన్ సర్కారు వచ్చాక అవన్నీ తీసేసి సచివాలయాలకు అప్పగించారని, దీంతో తామంతా ఆర్థికంగా నష్టపోయి ఉపాదిని కోల్పోయామన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి : సీపీఎం



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కందుకూరు, అక్టోబరు 3: కందుకూరు నుంచి కొండముడుసుపాలెం మీదగా వెళుతున్న జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టేందుకు ఫ్లైఓవర్ లేదా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం పట్టణ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడారు. కందుకూరు నుంచి గుడ్లూరు, కావలి, పెద్దపవని ప్రాంతాలకు రాకపోకలు ఎక్కువగా ఉండటం వల్ల ఎర్రవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని సబ్ కలెక్టర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామూర్తి, ఎస్‌కే మున్వర్ సుల్తానా, వెంకట్రావు, ఎస్‌కే మల్లిక, ఎం.పద్మ, ఎం.రవి, రాయుడు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఏడీఏ

ఆత్మకూరు, అక్టోబరు 3: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆత్మకూరు వ్యవసాయ ఉప సంచాలకులు వి దేవసేనమ్మ తెలిపారు. గురువారం మండలంలోని వెన్నవాడ, ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని పంటవీధి రైతుభరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, ఎన్నవాడ సర్పంచ్ జె జయలక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కె ప్రమీల, ఎంపీఈవో ఏ రేణుక, విఏఏ దీప, పలువురు రైతులు పాల్గొన్నారు.

●కందుకూరు : పంట వేసిన ప్రతిరైతూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాము సూచించారు. గురువారం కొండముడుసుపాలెం, కంచరగుంట రైతుభరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ-పంట నమోదుతో రాబోవు రోజుల్లో పంట నష్టపోయిన, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, కొనుగోలు కేంద్రాలతో ధాన్యాన్ని అమ్ముకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి డి.దనమ్మ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ ఖాసిం, సీహెచ్ వెంకట్ రాజా, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

●లింగసముద్రం: ప్రతిరైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ తెలిపారు. గురువారం మాలకొండరాయునిపాలెం, వీఆర్ కోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గొర్రెలలో నీలి నాలుక వ్యాధి, గేదెలలో గాలికుంటు వ్యాధి ఉన్నందున సకాలంలో టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు షేక్ అహమ్మద్, మార్కెటింగ్ సహాయకులు వినయ్ పాల్గొన్నారు.

●దగదర్తి(బిట్రగుంట): భూమిని సారవంతంగా చేసేందుకు రైతులు ముందుగా నవధాన్యాలను చల్లాలని గురువారం దగదర్తి మండలం నారాయణపురం రైతు ముర్రికుమ్మి సురేష్ తెలిపారు. పూతకొచ్చిన 45 రోజుల తర్వాత భూమిలోకి కలయదున్ని వరి నాటుకోవాలన్నారు. విత్తనాలు వేయడం వలన వేర్లు పాకి పచ్చిరొట్ట భూమిలో కలవడంతో పొల్లం సారవంతంగా మారుతుందన్నారు. ఐదేళ్లుగా 10 ఎకరాల పొలంలో రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఉపయోగపడే పనులు చేయండి

లింగసముద్రం, అక్టోబరు 3: ఉపాధిహామీ పథకం, 15వ ఆర్థికసంఘం నిధులతో గ్రామాల ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం, పారిశధ్యం మెరుగులకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్యదర్శి షేక్ గౌస్‌బాషా, గ్రామస్థులు పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం



జగదీష్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

అనంతసాగరం, అక్టోబరు 3: సోమశిలకు చెందిన ఉప్పలపాటి జగదీష్‌కు జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. రక్తదాత వాలంటీర్‌డే సందర్భంగా సేవా కార్యక్రమాల్లో జగదీష్ క్రియాశీలకంగా పని చేసినందుకు గాను జిల్లా అధ్యక్షుడు పి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం కోటారెడ్డి ఆయనను సత్కరించారు.

కలువాయి ఉపాధ్యాయుడికి అవార్డు

కలువాయి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జీ పెంచలపుల్లయ్య ఉత్తమ రక్తదాన ప్రేరేపకునిగా అవార్డు అందుకున్నారు. గురువారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు చైర్మన్, ఎమ్మెల్సీ పి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

- నిలువ నీడలేక ఎండలోనే నిరీక్షించిన కుటుంబసభ్యులు



కావలి: విట్స్ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు



బిట్రగుంట: అభ్యర్థుల హల్ టికెట్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

కావలి టౌన్, అక్టోబరు 3: విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (ఏపీ టెట్) ప్రశాంతంగా జరిగింది. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తొలి విడతగా మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండోవిడతగా పరీక్షలు నిర్వహించారు. గంట ముందే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని నిర్వాహకులు సూచించడంతో అభ్యర్థులు ఉదయం 8-30 గంటలకు మధ్యాహ్నం 2గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దూరాభారం నుంచి అభ్యర్థులకు తోడుగా వచ్చిన కుటుంబ సభ్యులు మూడున్నర గంటల పాటు నిలువ నీడలేక ఎండలో పడిగాపులు కాశారు. ఉదయం 130మంది పరీక్షలు రాయాల్సివుండగా 117మంది, మధ్యాహ్నం 130మందిలో 114మంది పరీక్ష రాసినట్లు పర్యవేక్షణాధికారి గా వ్యవహరించిన డిప్యూటీ డీఈవో రఘురామయ్య తెలిపారు. బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం 110మందిలో 96 మంది, మధ్యాహ్నం 110మందిలో 103 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

బిట్రగుంట: కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో గురువారం టెట్ పరీక్షలు (టీచర్స్ అర్హత పరీక్షలు) ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మహిళలలకు జరిగిన పరీక్షలకు 110 మందికి 96 హాజరైయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పురుషులకు జరిగిన పరీక్షలో 110 మందికి 103 మంది హాజరైయ్యారు. స్థానిక ఎస్ఐ బోజ్యా, ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అధికారుల 'మొద్దు' నిద్ర

కొత్తపల్లి రోడ్డు మార్జిన్‌లో వేసిన మామిడి మొద్దులతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటలు కొట్టేసిన తరువాత అందులోని మొద్దులు తెచ్చి రోడ్డు అంచున వేశారు. రాత్రిపూట ఎదురుగా వాహనాలు వచ్చినపుడు రోడ్డు అంచున ఉన్న వాహనాలు కన్పించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగితేగాని అధికారులు పట్టించుకోరా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సమీపంలో ఉన్న మొద్దులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - కావలి రూరల్

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- దసరా శోభతో మెరిసిపోతున్న అమ్మవారి ఆలయాలు
- విశేష పూజలు, అలంకరణలు



సీతారామపురం: నారాయణంపేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో భక్తుల పూజలు



కందుకూరు: అంకమ్మ పూజకు వస్తున్న ఉభయదాతలు



బిట్రగుంట: విద్యుత్ దీపాలంకరణలో కోదండరామాలయం

కావలి టౌన్, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రోత్సవాలు గురువా రం పట్టణంలో వైభవంగా ప్రారంభం అయ్యాయి. అమ్మవారి అలయాల్లో ప్ర త్యేక ఏర్పాట్లు, విద్యుదీపాలంకరణలతో దసరాశోభ సంతరించుకుంది. భక్తులు పెద్దఎత్తున వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతూరు శివాలయంలో దుర్గా భ్రమరాంబ బాలత్రిపురసుందరిదేవిగా, విష్ణాలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీదేవిగా వడ్డెపాలెంలో కనకదుర్గాదేవి అమ్మవారు కనక దుర్గాదేవి అలంకరణలో, ముసునూరులో మహాలక్ష్మమ్మ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి పర్యవేక్షణలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం అంకురార్పణ మహోత్సవం జరగ్గా భక్తులు పాల్గొని పూజలు చేశారు.

బిట్రగుంట: విశ్వనాధరావుపేట కోదండరామాలయ ఆవరణంలో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారు మొదటిరోజు బాలత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతసాగరం : సోమశిల సోమేశర్వుని ఆలయంలోని కామాక్షి అమ్మవారు త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందిచారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మిదేవి ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే దుర్గంపల్లి, గండిపాళెం, అడవిపేరంటాలమ్మ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుత్తలూరులో: గుంతబజార్‌లో ఎస్ఎస్‌యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల మానసాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడు నాగరప్పమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఆత్మకూరు : పట్టణంలోని సత్రం సెంటర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశ స్థాపన వైభవంగా జరిగింది. అమ్మవారికి అభిషేకం, శ్రీవాసవీ అష్టోత్తర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. అమ్మవారు భువనేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. తిరునాళ్ళతిప్ప కాశీనాయన ఆశ్రమ ఆవరణలోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురాసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర బలిజవీధి జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు స్వర్ణకవచాలంకృత జ్వాలాముఖిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో కలశ స్థాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి కామాక్షిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ వినయ్ కుమార్ స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీరించారు. తిరుమనకొండలోని రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, గంగమ్మ ఆలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి.



అల్లూరు: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ

సీతారామపురం: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో, నా రాయణంపేటలోని విజయ కనకదుర్గా దేవి ఆలయంలో కలశ స్థాపనతో దస రా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని గౌరిదేవి (శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి)గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపే ట విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అ నంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కందుకూరు: అంకమ్మతల్లిని ఉత్సవాల తొలిరోజు సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అలం కరించి అష్టోత్తర కుంకుమ పూజ నిర్వహించారు. పూజల్లో ఉభయ దాతలుగా కొనిజేటి రవికుమార్, అనిల్ కుమార్ బ్రదర్స్, ఇస్కాల మురళీ కృష్ణ, చక్కా బ్రహ్మయ్య, వందవాసి సుబ్బారావు, కొనిజేటి శ్రీనివాసులు వ్య వహరించారు. విఘ్నేశ్వుడికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణవేణి తీర్థప్రసాదాలు అంద జేశారు.

అల్లూరు: స్థానిక బీసీ కాలనీలోని పోలేరమ్మకు రాత్రి ఖడ్గమాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూలతో విశిష్ట పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆళ్వారు సురేష్, భాను దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

కలిగిరి: తెల్లపాడు భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఉదయం పుణ్యాహ వచనం, గణపతిపూజతో పూజతో పారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పంచాభిషేకం నిర్వహించారు. అమ్మవారు బాల త్రిపుర సుందరదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొండాపురం: సాయిపేట అభయాంజనేయస్వామి ఆలయంలో నేటి నుండి దేవీ నవరాత్రులు జరుపుతామని ఆలయ నిర్వాహకులు ఎమ్.సుబ్బారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.



కావలి పాతూరు శివాలయంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దుర్గాభ్రమరాంబాదేవి



కలిగిరి: బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు



ఉదయగిరిలో శివాలయంలో బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు



ఆత్మకూరులో భువనేశ్వరీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు